“బ్రహ్మ మొక్కటే” గ్రంథమాల

# మాల దాసరి కథ

రచన

**డా॥ ఆశావాది ప్రకాశరావు**

ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2016**

# MAALA DAASARI KATHA

*By*
**Dr. Aasavadi Prakasarao**

T.T.D. Religious Publications Series No. 1201
© All Rights Reserved

*First Edition : 2016*

*Copies :* 3000

*Published by*
**Dr.D.SAMBASIVA RAO,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

***D.T.P:***
Chief Editor Office
T.T.D, Tirupati.

*Printed at :*
**Tirumala Tirupati Devasthanams Press,**
Tirupati - 517 507

# ముందుమాట


**భా**రతదేశంలో అనాదిగా ఆ యా కాలాల్లో, ఆ యా కులాల్లో, ఆ యా ప్రాంతాల్లో అవతరించిన మహనీయులు ఎందరో మనకు దర్శనమిస్తారు. ఆ మహాపురుషులు అందరు వారి వారి కాలాల్లోని వివిధ పరిస్థితుల్లో కేవలం మనుగడ సాగించడం మాత్రమేగాక మానవోద్ధరణకు కృషి చేశారు. తద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యంతోపాటు ఆధ్యాత్మిక వికాసానికి కూడా ఆ మహామనీషులు ఎంతగానో తోడ్పడ్డారు.

అలాంటి మహాత్ముల జీవితగాథలను, వారు ప్రబోధించిన జీవన సత్యాలను, ఆధ్యాత్మిక సందేశాలను భక్తులకు అందించాలన్న తలంపుతో తిరుమల తిరుపతి దేవస్థానం **"బ్రహ్మ మొక్కటే"** అనే శీర్షిక క్రింద ఒక గ్రంథమాలను ప్రారంభించింది. అందు కనుగుణంగా కొందరు పండితుల చేత అలాంటి మహాపురుషుల జీవనరేఖలను చిత్రించే గ్రంథాలను రాయించి ప్రచురించాలని సంకల్పించింది.

అందులో భాగంగా ప్రస్తుతం డా॥ ఆశావాది ప్రకాశరావుగారు రచించిన **"మాల దాసరి కథ"** అన్న పుస్తకాన్ని అందజేస్తున్నాము. ఈ గ్రంథ పఠనం ద్వారా, పిల్లలు, పెద్దలు ఆధ్యాత్మిక చైతన్యవంతులు కావాలని ఆకాంక్షిస్తూ..

*సదా శ్రీవారి సేవలో....*

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.



# విషయసూచిక


1. ప్రవేశిక 1

2. వరాహపురాణ కథ 2

3. ఆముక్తమాల్యద కథ 3

3.1. దాసరి పరిచయం 3

3.2. దాసరి నిద్రాభంగం 5

3.3. రాక్షసుని ఆకారం 7

3.4. దాసరి రాక్షసుల మధ్య పోరాటం 8

3.5. దాసరిని బందీ చేయుట 9

3.6. దాసరి ధర్మప్రవచనం 10

3.7. బ్రహ్మరాక్షసుని చార్వాకం 12

3.8. రాక్షసుని పులకింత 16

3.9. దాసరి రాక్షసుని ప్రశంసించుట 17

3.10. తనను ఉద్ధరింపుమని రాక్షసుడు వేడుట 18

3.11. రాక్షసుడు హరిగానఫలం కోరుట 19

3.12. రామానుజాచార్యుల సేవల ప్రస్తుతి 21

3.13. బ్రహ్మరాక్షసుని ఆత్మకథ 23

3.14. బ్రహ్మరాక్షసునకు శాపవిముక్తి 25

3.15. సోమశర్మ దాసరిని సంస్తుతించుట 26

**ద్వితీయభాగం-విశ్లేషణ**

4. కథా ప్రాశస్త్యం 28

5. శీర్షిక నామౌచిత్యం 31

| | |
|---|---|
| 6. దాసరి ఆధ్యాత్మిక ప్రసంగం | 33 |
| 6.1. ఆహార శౌచం | 34 |
| 6.2. ప్రతిజ్ఞా పాలన | 35 |
| 6.3. శిబి ఆదర్శం | 37 |
| 6.4. ఆత్మ నివేదన | 38 |
| 6.5. మంత్ర మహిమ | 39 |
| 6.6. మంగళకైశికి ప్రాధాన్యత | 41 |
| 6.7. దాసరి కులం | 43 |
| 7. దేవాలయప్రవేశం | 45 |
| 8. ఆళ్వారుల ఆదర్శం | 47 |


# మాలదాసరి కథ

## 1. ప్రవేశిక

మాలదాసరి వృత్తాంతం మొట్టమొదట సంస్కృత వరాహపురాణంలోని 'వరాహ భూదేవి సంవాదం'లో కనిపిస్తుంది. మోక్షానికి రాచబాట అనదగిన భగవద్గాన ప్రాశస్త్యాన్ని ఈ కథ ప్రతిపాదిస్తుంది. దీనికి 'కైశికీ మాహాత్మ్యం' అని మరో పేరు. మాలదాసరి శ్రీరంగేశ్వరుని ముందు చేసిన సంస్తుతి 'మంగళ కైశికీ' రాగంలో ఉండటమే దీనికి కారణం. ఈ కథ నేటికీ పురాణంగా వైష్ణవాలయాల్లో పారాయణం చేయబడుతూ ఉంది.

ఈ సంప్రదాయాన్ని కాపాడటానికే తిరుపతి తిరుమల దేవస్థానంవారు 'మంగళకైశికీ మహోత్సవం' ను ఏటేటా (నవంబరునెలలో) కార్తికశుద్ధ ద్వాదశినాడు నిర్వహిస్తారు. ఈ ద్వాదశినాడే పూర్వం దాసరి గానఫల మాహాత్మ్యంవల్ల బ్రహ్మరాక్షసునికి శాపవిమోచనం కలిగింది. ఈ శుభదినాన్ని క్షీరాబ్ధి ద్వాదశి చిలుకు ద్వాదశి, యోగేశ్వర ద్వాదశి అనే పేర్లతో కూడా పిలుస్తారు.

తెలుగు సాహిత్యంలో దాసరుల ప్రస్తావన పాల్కురికి సోమనాథుని రచనల్లో కనిపించినప్పటికి, శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యద లోనే అగ్రపీఠం పొందింది. మాలదాసరి పేరేమో, అతని వృత్తి ఏదో, తల్లిదండ్రులు ఏం చేసేవాళ్లో స్పష్టంగా చెప్పకున్నా, చండాలుడని ముద్రవేయబడిన మాలదాసరి కారణజన్ముడు సుమా! అని అందరు అభినందించే స్థాయిలో నిలబెట్టినాడు శ్రీకృష్ణరాయలవారు.

వరాహపురాణం లోని అలతికథకు సృజనాత్మకత, ఆధ్యాత్మికత కలబోసినాడు రాయలు. తన కాలంనాటి సామాజిక పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని దీనిని పెంచి పోషించినాడు. కాన ఈ కథ వరాహపురాణ కర్తకు మానస సంతానం. శ్రీకృష్ణదేవరాయలు దీనికి పోషకుడు. ఈ

అద్భుతసృష్టి సమాజంచే చిన్నచూపు చూడబడేవారు, ఎలా ఎదిగి ఆరాధ్యస్థానం అందుకోవచ్చో బోధిస్తుంది. కారణాంతరాలచే పతితులైన అగ్రజాతులవారు పవిత్రుడైన మాలదాసరి వంటివారి దయాభిక్షను అర్థించి, ఎలా తమ్ము తాము ఉద్ధరించుకోవాలో తెలియజెప్పటం కూడా గ్రంథకర్త ఆశయం.

## 2. వరాహపురాణ కథ

ఒక మాలదాసరి తన ఇంటికి కొంత దూరంలో ఉండే మరో ఊరిలోని గుడికిపోయి, అక్కడ దేవుని సన్నిధిలో ప్రతిదినం స్తోత్రం చేసేవాడు.

ఇలా పది సంవత్సరాలు గడిచాయి. ఒక కార్తీక శుక్లద్వాదశినాటి రాత్రి వీణ తీసికొని మంగళకైశికి పాడటానికి గుడికి వెళ్లుతూ ఉన్నాడు. దారిలో బ్రహ్మరాక్షసుడు అతణ్ణి పట్టుకొని 'పది దినాలనుండి నాకు తిండిలేదు, నిన్ను తింటాను' అన్నాడు. దాసరి – 'అలాగే తిను. కాని నేను ఈ ప్రాంతంలో ఉండే గుడికి పోయి దేవునిసన్నిధిలో మంగళకైశికీ సేవ ముగించి తెల్లవారకముందే వచ్చి నీకు ఆహారం అవుతాను, అందుకు అంగీకరించు'– అన్నాడు. రాక్షసుడు ఒప్పుకోలేదు. చివరకు మాలదాసరి 'నేను తిరిగి రాకపోతే విష్ణుమూర్తిని ఇతర దేవతలతో సమానంగా చూచేవానికి ఏ పాపం వస్తుందో అదే పాపానికి నేనుగురి అవుదునుగాక!' – అని ప్రతిజ్ఞ చేశాడు. రాక్షసుడు సమ్మతించాడు. దాసరి వెంటనే గుడికి పోయి, ఆ రాత్రంతా జాగరణ చేసి కైశికీ గానంతో దేవుణ్ణి కీర్తించి, ఇచ్చిన మాటమేరకు రాక్షసుని దగ్గరికి వచ్చి 'నన్ను భక్షించు' అన్నాడు. అతని సత్యనిష్ఠకు రాక్షసుడు ఆశ్చర్యపోయాడు. అతనివల్ల తన పాపపు బ్రతుక్కి విముక్తి కలుగుతుందని నమ్మాడు. "నీవు ఈ రాత్రి విష్ణుసన్నిధిలో పాడిన పాట ఫలాన్ని ఇచ్చి నన్ను తరింపజేయి. లేదా సగమైనా ఇవ్వు. అదీ కాదంటే ఒక జాములో పాడిన పాటఫలమైనా ఇవ్వు. అలా కాకపోతే పాటలో చివరిపాదఫలమైన కైశికీ సుకృతం ధారపోయి" అని పాదాలపై పడి ప్రార్థించాడు.



చివరకు దాసరి కరుణించి కైశికీగాన ఫలం ఇచ్చాడు. వెంటనే వాని పిశాచత్వం పోయింది. "నేను సోమశర్మ అనే బ్రాహ్మణుణ్ణి. యజ్ఞం చేస్తూ, అది పూర్తి కాకుండానే మధ్యలో మరణించాను. దాంతో నాకు ఈ రాక్షస జన్మ వచ్చింది. నేడు నీ దయవల్ల విముక్తి పొందాను" అని తన వృత్తాంతాన్ని చెప్పి, దాసరికి వీడ్కోలు పలికి వెళ్లిపోయాడు.

## 3. ఆముక్తమాల్యద కథ

శ్రీరంగేశ్వరుడు తన భక్తుడైన విష్ణుచిత్తునితో మాలదాసరి కథ చెప్పినాడు. దాసరి కూడా శ్రీరంగేశ్వరుని భక్తుడే. అతడు, చెప్పటానికి వీలుగాని కులంలో పుట్టినాడు. వామనావతారంలో శ్రీమహావిష్ణువు నివసించిన 'తిరుక్కుఱుంగడి' అనే పవిత్రక్షేత్రానికి మూడు యోజనాల దూరంలో గల ఊరిలో నివసించేవాడు. అతడు ప్రతిదినం శ్రీరంగేశ్వరుని సేవించటానికై తెల్లవారు జాముననే లేచి, కాలి నడకతో వచ్చి మహాభిలాషతో మంగళ కైశికీ రాగంలో విష్ణుస్తుతి చేసేవాడు.

తన జాతికి ఏ ధర్మాన్నైతే పెద్దలు ఏర్పరచారో దాన్నే ఆచరించేవాడు. శరీరం మలినంగా ఉన్నా, మనస్సును నిత్యం శుచిగా ఉంచుకొనేవాడు. మసిపాతలో దాగిన మాణిక్యం వంటివాడై సాధుపద్ధతిలో ప్రవర్తిస్తూ, ఉత్తమోత్తముల ఆచారం పాటించేవాడు.

### 3.1. దాసరి పరిచయం

ఆ దాసరి బాగా చమురుపట్టిన తోలుచొక్కా ధరించేవాడు. తలపై టోపీ ఉండేది. ఇత్తడితో చేసిన శంఖాన్ని ఒక చెవికి, చక్రాన్ని మరో చెవికి అలంకరించుకొనేవాడు. ఒక చంకలో బాణం, పసుపుపొడిగల తోలుసంచి, మొగలాకుల గొడుగు, బాణం ఉండేవి. ఇంకొక చంకలో విష్ణుపాద రక్ష, గుఱ్ఱం వెంట్రుకల్తో కుట్టిన వీణ, కొయ్యచిరుతలు, వెదరుబుట్ట వ్రేలాడుతూ

ఉండేవి. అతడు దీప స్తంభాన్ని మోస్తూ ఉంటాడు. నడుస్తున్నప్పుడు తాళాలు పరస్పరం సోకి చిరు శబ్దం చేసేవి. పెద్ద పెద్ద తులసిపూసలతో కుట్టిన దండ మెడలో ఉండేది. అతడు నల్లని దేహచ్ఛాయ కలవాడు. నుదుట వెడల్పుగా, తెల్లగా నామాలు తీర్చబడి ఉండేవి. సరిగా నిద్రలేక కాబోలు అతని కన్నులు ఎరుపెక్కి ఉండేవి.

అతడు దైవాయతనాన్ని చేరగానే తన వెంట వున్న వస్తువులన్నీ ఒక మూల ఉంచేవాడు. దైవదర్శనం కాగానే తన్మయత్వానికి లోనై, గగుర్పాటు చెంది. ఉద్ధతితో తాండవం చేసేవాడు. దారిలో తగిలిన వడగాలిని గాని, పొందిన ఆకలిని గాని, ప్రయాణ బడలికను గాని లెక్కపెట్టేవాడు కాదు. సూర్యుడు నడినెత్తికి ఎక్కేదాక భక్తిలో లీనం చెంది, రాళ్లు కరిగేటట్లుగా, వీణను మీటుతూ, చెక్కిళ్ల మీదుగా ఆనందబాష్పాలు ఏకధారగా స్రవిస్తూ ఉండగా విష్ణుస్తోత్రాలను ఆలపించేవాడు.

**గండాభోగములన్ ముదశ్రు లహరుల్ గప్పన్ నుతుల్ పాడి ఆ**
**దండన్ వ్రేగులు డించి భక్తిజని తోద్యత్తాండవం బాడు నా**
**చండాలేతర శీలు దుత్పులకుడై చండాలికన్ మీటుచున్**
**గుండుల్ నీరుగ నెండ గాలి పసితాకున్ జూడ కాప్రాహ్ణమున్**
**ఆముక్త మాల్యద 6/7**

ఇలా చాలాసేపు విష్ణువును కొలిచి సాష్టాంగదండ ప్రణామాలు ఆచరించేవాడు. గర్భమంటపాన్ని శుభ్రం చేయగా బయటికి వచ్చిన మలిన జలాన్నే, శూద్రుడు ఎత్తిపోయగా కృతజ్ఞతా పూర్వకంగా స్వీకరించి త్రాగేవాడు. బ్రాహ్మణులను చూడగానే వారిని గౌరవించే నెపాన అప్పటి సంఘ నియమాలకు కట్టుబడి, వారు మైల పడకూడదని, దూరంగా తొలగి పోయేవాడు.

ఎంత ఆలస్యమైనా విసుగు చెందకుండ తనకు ప్రసాదం లభించేదాక వేచి ఉండేవాడు. అతని భక్తిని విశ్వాసాన్ని మెచ్చుకొని ఎవరైనా



బ్రాహ్మణేతరులు తాము పొందిన ప్రసాదంలో కొంత ఇతనికి ఇవ్వాలని చూస్తే, దానిని తీసికోవడానికి తన దండెను చాచేవాడు. వారు ప్రసాదాన్ని దానిపై ఉంచితే అదే తన పాలిటి భాగ్యంగా భావించి, స్వీకరించి కళ్లకు అద్దుకొని ఆరగించేవాడు.

పుట్టుకచే చండాలుడు కావటం చేత, అస్పృశ్యత అనబడే జాడ్యానికి గురి యగుటచేత, ధైర్యం చాలక గుడిలోనికి ప్రవేశించేవాడు కాదు. బయటి ప్రాకారాన్ని మాత్రమే చుట్టివస్తూ, ప్రదక్షిణ చేసేవాడు. బాగా ప్రొద్దు పోయిన తరువాత తన పల్లెకు వెళ్లేవాడు.

## 3.2. దాసరి నిద్రాభంగం

ఒకనాడు అర్ధరాత్రి సమయంలో దాసరి ఇంటిలోకి పిల్లి జొరబడింది. భయంతో కోడి గట్టిగా కూత పెట్టింది. దాసరి తెల్లవారింది – అనుకున్నాడు. 'స్వామి సేవకు వేళైంది. సకాలంలో గుడి చేరి స్తుతిగీతాలు పాడాలి కదా! అని బయలు దేరినాడు. దారిలో మరులుతీగ తొక్కినాడు. కూతపెట్టితే, బదులుగా పలికే గాఢమైన చీకటిలో భ్రమకు లోనై ఎటువెళ్తున్నాడో తనకే తెలియని స్థితిలో దారి తప్పి పొలాలవెంట పడి నడుస్తూ, తెల్లవారే సరికి మానవ సంచారం లేని దట్టమైన అడవి చేరినాడు.

అతడు వెళ్లేదారిలో కూలిపోయిన ఇండ్లున్నాయి. వాటి ద్వారాలకు ఇరువైపులా గడ్డి మొలిచి, పొదలు తయారయ్యాయి. పడిపోయిన గాదెల క్రింద బొరియల్లో దూరి, ఆకలికి నకనకలాడే పొట్టల్తో పందికొక్కులు నివాసం చేస్తున్నాయి. దుమ్ముపడి సగానికి పూడిపోయిన బావులపై గుంతలపై చిగురులు మూతగా కప్పి ఉన్నాయి. చీమలు గింజల్ని ఈడ్చుకొనిపోగా, దారిలో సారంలేని కంచెల తావుల్లో, పండిన గునుకు గింజలవెన్నులు పెరిగి, పండి, ఎండి, రాలి అణగిపోతున్నాయి. పెంటలమీద పెరిగిన దొగ్గలిచెట్ల మొదళ్లలో ముసలి పిల్లులు క్షుద్బాధచే అంగలార్చుతు, కడుపు

అంటుకొనిపోయి, మీసాలను కూడ కదప లేక పడి ఉన్నాయి. పొలాల అంతటా గడ్డీ గాదము దట్టంగా పెరిగింది. మళ్లల్లో తాలుగింజల ఈనెలు గంటలు కట్టాయి. నిత్రాయి తప్ప ఏమీ మిగులని ఏతాలతో పాడైపోయిన బావులున్నాయి.

అలాంటి అపమార్గంలో పడి ఆ దాసరి వెళ్తున్నాడు. దారిలో ఉత్తరేణి, పల్లేరు, మొదలైన ముళ్లు కాళ్లకు కుచ్చుకుంటూ ఉండగా వాటిని వైనంగా తొలగించుకుంటూ మరింత ముందుకు సాగినాడు. ఎదుట ఒక మఱ్ఱిచెట్టు ఉంది.

**కాంచెన్ వైష్ణవు దర్ధయోజన జటా ఘాటోత్థ శాఖోపశా**
**ఖాంచజ్ఝాట చరన్మరుద్రయ దవీయః ప్రేషితోద్యచ్ఛదో**
**దంచత్కీట కృత వ్రణచ్ఛలన లిప్యాపాదితాధ్వన్యని**
**స్సంచారాత్త మహాఫలోపమఫలస్ఫాయద్వటక్ష్మాజమున్**

**(ఆముక్త మాల్యద6/15)**

ఆ మఱ్ఱిచెట్టు ఊడలు అర్ధయోజనపర్వతంలాగా పొదువుగా విస్తరించి ఉన్నాయి. వాని పై భాగం నుండి కొమ్మలు, ఆ కొమ్మలకు కొమ్మలు, మళ్లీ వీటికి కొమ్మలు మొలిచి చెట్టు దట్టంగా ఉంది. బిట్టుగా వీచే గాలి తాకిడికి ఆ చెట్టులోని ఎండిన ఆకులు దూరంగా ఎగిరి పడుతున్నాయి. పురుగులు తొలచిన కారణంగా ఆ ఆకులపై పడిన గీరలు అక్షరాల్లా కనిపిస్తున్నాయి. “ఓ బాటసారుల్లారా! నాలో ఒక బ్రహ్మరాక్షసుడు ఉన్నాడు. మీరు ఇక్కడి రావద్దండి” – అని హెచ్చరిస్తూ ఉందా అన్నట్లుంది ఆ వ్రాత.

దాసరి ఆశ్చర్యంగా ఆ చెట్టును చూస్తూ ఉండగానే, కాలిత్రోవ కనిపించింది. అది తన భాగ్యవిశేషం అనుకున్నాడు. వడివడిగా మఱ్ఱివైపు కదిలాడు. అక్కడ దుర్గంధం రాజ్యమేలుతూ ఉంది.

మెదడును సంపూర్ణంగా జుఱ్ఱి విసరివేయబడిన డొల్ల పుఱ్ఱెలు అక్కడ కనిపిస్తున్నాయి. కండ ఏమాత్రం మిగిలించకుండా పండ్లతో గోకి తినటంతో



గీరలు పడిన ఎముకలున్నాయి. మందలు మందలుగా ఈగలు క్రిక్కిరిసి వాలటంతో అదేమిటో తెలిసికోవటానికి వీలులేని పచ్చితోళ్లు, కంపలమీద వ్రేలాడుతూ ఉన్నాయి. దిబ్బలుగా ఏర్పడి గాలిలో ఎగిరిపడుతున్న దుమ్ము పట్టిన వెంట్రుకల గుట్టలున్నాయి. అక్కడక్కడ తెగిపడిన మానవుల అవయవాలను అత్యాశచే వీలైనన్ని నోట చిక్కించుకోదలచి కొట్లాడుతున్న కుక్కలు, ఆ కారణంగా వాటి కాళ్ల క్రింద నలిగి అసహ్యమైన కంపుగొడుతున్న ఎండిన మాంసపు ముక్కలు కనిపిస్తున్నాయి.

దొంగచూపుల ఆడకుక్కలు ముందరికాళ్లను పైకెత్తి ఎముకల్ని కరచుకొని పారిపోతున్నాయి. గ్రద్దలు మాంసఖండాల తోరణాలను అపహరించుకొని తటాలున ఎగురగా, వాటికి చెట్టుకొమ్మ తగలటంతో అవి రోదిస్తున్నాయి. చెట్టులోనే ఉన్న ఎవరితోనో అరచేతిదెబ్బలు తిన్నాయా అన్నట్లుగా కోతులు చేతుల్ని నడుమున చేర్చి ఏడుస్తున్నాయి. కొన్నిమారులు ఆ చెట్టుపై ఏదో ఉండీ ఉండనట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.

ఇదంతా గమనించిన దాసరి ‘ఈ చెట్టుపై ఎవరుంటారు? ఆకులో కట్టెలో కావాలని ఈ సమయంలో మానవులెవ్వరు వచ్చే వీలే లేదు. ఇక్కడ మాంసపుగాలి వీస్తూ ఉండటం సందేహానికి తావిస్తూ ఉంది. నేనింకా చాలాదూరం వెళ్లాలి’ అని ఆలోచిస్తూ ఉండగా అతనికి చెట్టుపై బ్రహ్మరాక్షసుడు కనబడినాడు.

## 3.3. రాక్షసుని ఆకారం

ఆ రాక్షసుడు మానవశరీరాన్ని గోచిగా పెట్టుకొన్నాడు. ఆది చాలనందున గట్టిగా బిగించటంతో బొడ్డుమీద, మొలతాడు మీద రక్తం చిలికింది. ఎఱ్ఱని దుప్పటి కప్పుకొని ఎఱ్ఱచీమలు ప్రాకిన ముంతమామిడి చెట్టులా ఉన్నాడు. రెండుపాయలుగా ఉన్న అతనిగడ్డం తలక్రిందులు చేయబడిన ఏనుగు తలను పోలి ఉంది. దవడల ప్రక్కనగల రెండుకోరలు

ఏనుగుయొక్క దంతాలవలె కనిపిస్తున్నాయి. మీసాలతో కలిసి వ్రేలాడుతున్న అతనిగడ్డం కందిరీగలాగా గోరోచనం రంగుతో ఉంది. చొంగ కారుతున్న అతని నోటి చివరిభాగాలు తెల్లగా ఉన్నాయి. ఎవరైనా తనకు ఆహారంగా దొరుకుతారేమో అని ఆ రాక్షసుడు చెట్టుకొమ్మల్ని ఎక్కి దిక్కులు చూస్తున్నాడు. ఏమరుపాటువల్ల జారిన తన ప్రేవుల జంద్యాన్ని కోపంగా మళ్లీమళ్లీ విసరుకుంటూ ఉన్నాడు.

వ్రేలాడుతున్న బొజ్జతో, బోదకాళ్లతో, చెంబుతలతో, ముచ్చిలి గుంటలో మాత్రమే పెరిగిన చిన్నజుట్టుతో ఉన్నాడు. అతని కనుగ్రుడ్లు బాగా బలిసి ఉన్నాయి. ఆకలికి తట్టుకోలేక తన సేవికలైన బేతాళికలను బండబూతులు తిడుతున్నాడు. ఆ బాపన రక్కసుడు కొండంత బరువుతో, కుండను పోలిన మోకాలి చిప్పలతో 'కుంభ జానువు' అనే పేరు తనకు తగినట్లుగా ఉన్నాడు.

### 3.4. దాసరి రాక్షసుల మధ్యపోరాటం

దాసరిని చూడగానే ఆ రాక్షసుడు నీవు నా కంటబడ్డావు. ఇక ముందుకు వెళ్లలేవు. చూడు నా తడాఖా అంటూ అరిచాడు. ఒక్క మారుగా చెట్టునుండి నేలకు దుమికినాడు. ఆ వేగానికి చెట్టు కాస్త నుగ్గు నూచ అయ్యింది. ఆ దాసరి రేయింబవళ్లు భయం లేకుండా తిరిగేవాడు. పరాక్రమవంతుడు. వెనుకటికి కొంతకాలం దండులో కొలువుండి యుద్ధకౌశలం ప్రదర్శించి ప్రసిద్ధి కెక్కినవాడు. కాబట్టి ధైర్యంగా కాలూది నిలబడ్డాడు. తన దగ్గరున్న చేతిబాణంతో రాక్షసుణ్ణి పొడవాలని చూచాడు. అంతలోనే వాడు ఆ బాణాన్ని త్రుంచివేశాడు.

ఇరువురి మధ్య మల్లయుద్ధం జరిగింది. రాక్షసుడు తనను లాగగా దాసరి ఉన్నచోటనుండి కాళ్లను కదలనీక ఊని నిలిచాడు. రాక్షసుని వక్షఃస్థలాన్ని పిడికిలిచే చరచే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ నిశాచరుడు ఉపాయంగా వాటిని తప్పించుకొంటున్నాడు. దాసరి రాక్షసుని వీపుపై పిడిగ్రుద్దులు గ్రుమ్మటానికి సిద్ధం కాగా వాటినీ, తప్పించుకొన్నాడు. గురిపెట్టి దాసరి రొమ్ముపై పడిన ముష్టి ఘాతాలకు సిద్ధమైనాడు. సురియాళుడు తన పిడికిళ్ల బిగువే తనపాలిటి కోటగా తనను రక్షించుకుంటూ, రాక్షసుడు ఏవైపు తిరిగితే, తానూ ఆ వైపు తిరుగుతూ, తప్పించుకుంటూ అతని వీపును నడుమును చుట్టేసి బాగా కొట్టాడు. ఎంతగానో అలసి పోరాడుతున్నా దాసరి తన మనస్సులో విష్ణుపాదాలను స్మరించటం మాత్రం మరచిపోలేదు.



### 3.5. దాసరిని బందీ చేయుట

తనను తన్ని వెళ్లిపోవటానికి సిద్ధమైన ఆ దాసరిని గమనించి బ్రహ్మరాక్షసుడు రాక్షసీ సమూహాన్ని పిలిచాడు. 'అదిగో వాడు నన్ను కొట్టి పారిపోతున్నాడు. రండి వాడిని పట్టుకోండి' అని హెచ్చరించాడు.వారు చెట్టుదిగి వచ్చారు. వెంటనే రాక్షసుడు, అతని స్త్రీలు దాసరిని పట్టుకొన్నారు. అతడు ఆబోతువంటి బలసిన శరీరం కలవాడు కావటంతో రాక్షసుణ్ణి కాళ్లతో తన్నుతూ, మోచేతితో, డొక్కల ఇరువైపులా పొడుస్తూ పోరాడుతున్నాడు. అయినా రాక్షసుడు దాసరిని లాక్కొని వచ్చి చెట్టుదగ్గరికి చేర్చి ఇలా అన్నాడు.

ఓరీ! పొగరెక్కిన నీ తలను నరికేస్తాను. మొండెం నుండి బయటికి చిమ్మే నీ వేడి రక్తాన్ని త్రాగి నా దప్పిక తీర్చుకుంటాను. నా పంచ ప్రాణాలకు తృప్తి కలిగిస్తాను. నీ మాంసాన్ని కరకుట్లుగా మాడ్చి నా భార్య అందిస్తూ ఉండగా హాయిగా తింటాను. ఈ తాటితోపులో చెట్లకు కట్టిన కపాలాల్లోకి, వచ్చిపడుతున్న కల్లును త్రాగుతాను. నన్ను ఎంతగానో బాధపెట్టిన నిన్ను చిత్రహింసల పాలు చేయకుండ ఊరకే వదలిపెడ్తానా? అంటూ నిట్టూర్పులు విడుస్తూ అలసిపోయేటట్లు గట్టిగా అరిచాడు.

దాసరి కుత్తుకను నరకటానికి కత్తిని, రక్తాన్ని పట్టడానికి పాత్రను తెమ్మని పిశాచికలను ఆదేశించాడు. అతని కాళ్లు చేతులు కలిపి, శరీరాన్ని

ఒంచి, త్రాళ్లతో కట్టి, కోలగగ్గెర వేసిన పశువును పడవేసినట్లుగా చెట్టుమూలకు ద్రొబ్బినాడు. అయినా దాసరి ఏ విధమైన దైన్యం గాని భీతి గాని చెందకుండ, రాక్షసునకు ధర్మ సూక్తుల్ని ఈ విధంగా వినిపించాడు.

## 3.6. దాసరి ధర్మప్రవచనం

ఓయీ! రాక్షసుడా! ఒక్కమాట విను. నేను నీ కంచంలోని అన్నాన్ని. నే నెక్కడికి వెళ్తాను? నన్ను తినటానికి అంతగా తొందర పడుతా వెందుకు? మహాపరాక్రమవంతుడైన నీతో పోరాడి దేవతలు కూడ గెలువలేరని నాకు తెలుసు. అయితే ఆపదలో చిక్కుకొన్నప్పుడు తన ప్రాణాన్ని తాను రక్షించుకోక పోవడం పాపం అవుతుంది. అందుకే నా వంతు కర్తవ్యం నేను చేశాను. ఎందుకు అంతగా కోపపడుతావు? నాకు శరీరంపై మమకారం లేదు.

“ఇది పోవటమే మంచిది. ఎందుకంటావా? నాది నీచ జన్మ. మరణంతో ఆ లోపం తీరుతుంది. అవసానకాలంలో మరొక్కరికి ఆహారం కావటంవల్ల అవతలి ప్రాణి సంతోషిస్తుంది. పరులకు ప్రమోదాన్ని కూర్చేవాడు మోక్షాన్ని పొందుతాడు. అశాశ్వతమైన శరీరాన్ని ఇచ్చి శాశ్వతమైన కైవల్యాన్ని పొందటం మంచిదే కదా! ఈ విషయంలో నాకు శిబిచక్రవర్తియే ఆదర్శం” – అన్నాడు.

**హీన జన్మమరుట, ఎవ్వడేనొకప్రాణి**
**సంతసిలుట, ముక్తిపొంతగనుట**
**మేలె కాదె, శిబియ మేల్బంతి గాడె, న**
**శ్వరపు దేహ మమ్మి పరము గొనుట**

**ఆముక్త మాల్యద 6/29**

ఈ శరీరం రోగాలబారి పడి నశిస్తుంది. గ్రహాలకు బలి అవుతుంది. విషకీటకాల వల్లనో, సర్పాలచేతనో కాటు వేయబడుతుంది. వ్యసనాలకు మనోవ్యాధులకు గురి అవుతుంది. దొంగలకో క్రూర మృగాలకో చిక్కుతుంది.



పిడుగు పాటులతో కూలిపోతుంది. ఏ విధంగా చూచినా దీనివల్ల మేలు లేదు.

ఇంకొక్కమాట చెబుతున్నాను. విను. నేను ప్రాణభయం వల్లనో, కార్యసాధన కోసమో మాటాడటం లేదు. నిష్పక్షపాతమైన మధ్యే మార్గం తెలుపుతున్నా. భూతహితంగా పలికే మాటకు ఈశ్వరుడు మెచ్చుకుంటాడు. నీవు పెద్దపులి, సింహం, పంది, తోడేలు, నక్కవంటి ఘాతుక మృగాలలోని వాడివి కాదు. కడుపు భూమిపై పెట్టుకొని పండుకొనే జంతువూ కాదు. దేవతా జన్మ కలవాడివి. మానవులమైన మాకు ఉన్నట్లే నీకూ కాళ్లు, చేతులు, ముఖం తోడి శరీరం ఉంది. మీకు మాకు మాట్లడే శక్తి సమానం. ఏది చేయదగిందో, ఏది చేయకూడనిదో నిర్ణయించు కోగల జ్ఞానమూ ఒక్కటే.

అంతేకాదు చెట్టు చేమలు, కొండలు కోనల కంటె కీటకాలకు, వాటికంటె మృగాలకు, వాటికంటె పశుపక్ష్యాదులకు, వాటికంటె మానవులమైన మాకు, మా కంటె రాక్షసులైన మీకు, శరీర పాటవం, విషయ విజ్ఞానం ఎక్కువ. అట్టి నీకు హేయం, నిందాస్పదం, బీభత్సం, అయిన జీవనవిధానం మంచిది కాదు. ఏది వధింప దగిందో, ఏది భుజింప దగిందో, ఏది త్రాగ దగిందో నిర్ణయించుకో గల ఇంగిత జ్ఞానం నీకు లేక పోవటం చాలా చింతింప దగి ఉంది. రుచిగాని, శుచిగాని లేనిది ఈ మానవ దుర్మాంసం. ఎందరినో హింసించటంవల్ల ఎంతో పాపాన్ని మూటకట్టుకొన్నది ఈ శరీరం.

నీ వనవచ్చు– “ఓరీ! దాసరీ! హింసకు తగిన శిక్ష పరలోకంలో కదా! వచ్చేది. అదైనా ఈ జీవి చచ్చిపోయిన పిమ్మటే కదా! కాబట్టి రాక్షసులమైన మాకెందుకు? హింసాభయం” – అని. గుర్తుంచుకో మీకైనా, మాకైనా, నేడైనా, రేపైనా ప్రాణభీతి తప్పదు. ప్రాణాలు కోల్పోవటం అందరికీ సమానధర్మం అయినప్పుడు, నీవు ముందు, నేను తర్వాత లే” అనే వితండవాదం అర్థం లేనిది. పర్వతమైనా పరమాణువైనా మున్నీట మునిగే

దుస్థితి తలెత్తినప్పుడు వాటి మధ్య గొప్ప, చిన్న, అనే తేడాలు ఎందుకు? కాగల కార్యాన్ని మాత్రమే ఆలోచింప వలసి ఉంది.

పూర్వం తపస్సు చేసి సంపాదించుకొన్న వరాలవల్ల దేవతల్ని హింసించిన రావణ, హిరణ్య, కశ్యపాది రాక్షసులు, శతసహస్రవత్సరాలు బ్రతికినా చివరకు చావక తప్పలేదు. ఏ యముణ్ణి జయించినామని విఱ్ఱవీగినారో చివరకు అతని చేతికే చిక్కవలసి వచ్చింది. ఈ లోకంలో మీరు తిరుగులేని బలవంతులైతే, పై లోకంలో వారు సాటిలేని వారవుతారు.

ఆ యా జీవులన్నీ స్థానబలం చేత ఉత్తమ అధమ తారతమ్యాన్ని పొందుతూ ఉంటాయి. హద్దులు మీరిన మాకెట్లో మీకూ కర్మసాక్షి కుమారుడైన యమునిలోకంలో శిక్షలు తప్పవు. నిజానికి మీరూ దేవతల సోదరులే కదా! అయిన పరలోకంలో ఒకరు బంధించేవారు. మరొక్కరు బాధకు గురయ్యేవారు అవుతున్నారా? లేదా?

ఈ విధంగా తేజస్సంబంధమైన భేదాలకు హేతువులు తమస్సు, సాత్త్వికం అనబడే గుణాలు. ఆ యాగుణాలు యజ్ఞాల్లోని ఆహారం ఆధారంగా సిద్ధిస్తాయి. "భూర్భువస్సువః" మున్నగు వేదమంత్రాలచే పవిత్రమైన హవిస్సు స్వీకరించడం వల్ల దేవతలు పవిత్రులై ఎక్కువ కాలం జీవిస్తున్నారు.

ఈ సత్యం తెలిసే బ్రహ్మ అంశగల చంద్రుడు అన్ని రసాలకు పరాకాష్ఠయైన అమృతంచే తృప్తి కలిగిస్తున్నాడు. తక్కువ కులం వాడినైన నేను చెప్పరాదు గాని, చంద్రునిలోని తొలి కళయైన సుధను అగ్నిదేవుడు త్రాగుతాడని వేదాలు చెప్తున్నాయి. అంతేకాక ఆ యా కళలు ఆ యా దేవతలకు సంక్రమిస్తున్నాయి. కాబట్టి వీటన్నింటిని సక్రమంగా ఆలోచించి మంచి ఏదో నీవే నిర్ణయించుకో అని దాసరి అన్నాడు.

### 3.7. బ్రహ్మరాక్షసుని చార్వాకం

దానికి రాక్షసుడు వికటాట్టహాసం చేసి క్రింది విధంగా పలికినాడు.



చదువుల పేరిట నన్ను చంపవద్దు. నేను చదువకుండ విడిచి పెట్టిన శాస్త్రాలు, వేదాలు అంటూ ఏవీ లేవు. అయితే అవి నాకు ప్రియం కావు. దేవతలూ, మేమూ భ్రాతలమే. వారు అమృతాహారులే. కాని మావలె అపవిత్రమైన శవాదుల్ని తినరు – అని అన్నావు. ఏ అగ్ని అయితే చంద్రునిలోని ప్రథమకళను త్రాగునని చెప్పినావో, ఆ అగ్ని సర్వభక్షకుడు కాదా? ఆ ఆచారమే మాకు ప్రమాణం. పెద్దల పద్ధతిని అనుసరించటం ఎందుకు పాపమవుతుంది? కాబట్టి ఇంక మరో మాట పలుకవద్దు. నోరు మూసికో.

హరికి రథచోదకుడైన గరుత్మంతుడు, దొరికిన అమృతాన్నేమో ముట్టకుండ, కోరకుండ, తమ జాతికి సర్పాలు ఆహారం కావాలని వరం అడిగినాడు. ఎవరికైనా తాము సహజంగా అలవాటుపడిన ఆహారమే గొప్పది అవుతుంది. దాని ముందు అమృతమైనా దిగదుడుపే.

**హరికి సఖుదును రథమును నగు గరుడుడు**
**దొరికి నమృతంబు సురలకు మరల నిచ్చి**
**అహులు కూడుగ వరమున నడిగి కొనడె**
**అమృతమైనను చవుల జాత్యన్న సమమె?**

**ఆముక్తమాల్యద 6/34**

నిద్రకు దూరమై ఆహారం మాని నేను ఎంతో కష్టపడి చదివి సాధించింది ఏమీ లేదు. ఈ విద్యల్లోని మిథ్యా కల్పనల్ని చూచి, అసత్యవాదనల్ని ఆలకించి, నావంటివాడు ఎవ్వడూ మోసపోడు. నీవు చదువుల గొప్పతనాన్ని ఏకరువుపెట్టినా ప్రశంసకు పాత్రుడు కాలేవు. మొత్తం మీద నీవు నా పాలిట చదివిన కూరవు. నాకు బలే రుచికరమైన ఆహారానివి. నాకు అంతకుమించి మరేమీ అక్కర లేదు – అంటూ బ్రహ్మరాక్షసుడు చార్వాకం వల్లె వేసినాడు. దాసరి యొక్క విలువైన మాటల్ని అవహేళన చేసినాడు.

ఆ రాక్షసుని కుతంత్రపు మాటల్ని విన్న పాపాన్ని తొలగించుకోవటానికై దాసరి 'కృష్ణ కృష్ణ' అంటూ దైవస్మరణ చేసికొన్నాడు. ఇతనితో ఇట్లే వాదనకు దిగితే ఇంకా ఏలాంటి ఇబ్బందికరమైన మాటలు వినవలసివస్తుందో, మనస్సుకు ఇంకెంత క్షోభ కూర్చుకోవలసి వస్తుందో అని భయపడ్డాడు. కాగలకార్యం ఉండగా ఇతనిని కాదని ఖండిస్తూ కాలయాపన చేయటం తగదని తలంచినాడు. తనకు తానుగా ఒక నియతికి లొంగి, ఎదుటివాని కుసంస్కారానికి బాధపడి ఆ రాక్షసుణ్ణి సంతోషింపజేసే మాటలకు సిద్ధమై తన హృదయాంతరంలో తథాగతుణ్ణి నిల్పుకొని ఇట్లా పలికినాడు.

అయ్యా! నీవు అన్నీ తెలిసిన వాడివి. నేను సామాన్య మానవుణ్ణి. తక్కువ కులం వాడిని. శాస్త్రాదు లేవీ చదువనివాణ్ణి. నీకు బదులు చెప్పగలిగే సామర్థ్యం నా దగ్గర లేదు. నా సంభాషణలో దొరలిన తప్పుల్ని సహించి క్షమించి నా తుది విన్నపం ఆలకించు.

నీవు రాక్షసుల్లో ప్రసిద్ధి కెక్కిన వాడివి. నేను నీ కీర్తి ఇనుమడింప చేసే మార్గంలో నడుస్తానులే. నీకు నా దేహాన్ని దానంగా ఇవ్వడం తప్పింపను. అయితే నేడు నేను తప్పనిసరిగా ఆచరింపవలసిన ముఖ్య వ్రతం ఒకటుంది. అది నెరవేరేటట్లుగా నన్ను దయ చూడు. ఏడడుగులు కలిసి నడిస్తే స్నేహం అవుతుందని పెద్దలంటారు. ఈ విధంగా బలపడిన మనస్నేహానికి విలువ ఇచ్చి నా కోర్కెను తీర్చు.

అదేమిటంటే ఇక్కడికి దగ్గరలోనే 'తిరుక్కుఱుంగడి' అనే క్షేత్రం ఉంది. నేను ఇన్నాళ్లు ప్రతిదినం నెరవేరస్తూ వచ్చినట్లుగానే నేడు కూడా వెళ్లి శ్రీమన్నారాయణుణ్ణి పాటలచే సంస్తుతించి ఆ పరాత్పరునిసేవ ముగించి వచ్చి నీకు ఆహారం అవుతాను – అన్నాడు.

ఆ మాటలు వినగానే రాక్షసుడు చిరునవ్వు నవ్వి దాసరియొక్క చెక్కిలి మీటుతూ దాసరీ! లెస్సగా పలికావు. నీవు ఇంతకాలం ఎన్నో దారి దోపిడీలు



చేసినవాడివి. 'ఉదర నిమిత్తం బహుకృత వేషం' అన్నట్లు సుఖజీవనం కోసం లేని వైరాగ్యం నటించే దాసరిగా ఈ మధ్యనే అయినావు. నన్ను మోసగించటానికి అతికేటట్లు మాటలు కట్టుతున్నావు. నిన్ను నేను నమ్మను. పరమ జాగరూకుడనైన నానుండి నీవు తప్పించుకోవాలని చూస్తున్నావు. నీ మోసానికి నేను గురి అయ్యేవాడిని కాదు – అన్నాడు.

ఎవ్వడూ తన నోటికి అందుతున్న కూడును తానుగా పోగొట్టుకోడు. అట్లే ఎవ్వడూ తన మాటమీద నిలబడి దేహం ఆహారంగా అర్పించడానికై తిరిగిరాడు. ఇట్టి సందిగ్ధ పరిస్థితుల్లో నిన్ను నేను పోనీయను. నీవును పోలేవు. ఓయీ! కడజాతివాడా! అనవసరంగా అధికప్రసంగం చేయవద్దు. నీవు ఎంతగా మొత్తుకున్నా ప్రయోజనం లేదు – అన్నాడు.

ఆ రాక్షసుని మాటలకు 'నారాయణ! నారాయణా!' అంటు దాసరి చెవులు మూసికొని, అయ్యా! నేను ఒటుపెట్టుతున్నాను. నన్ను నమ్ము అంటూ ఎన్ని ప్రమాణాలు చేసినా ఆ పొలదిండి అంగీకరించలేదు. ఇక చివరగా – నేను నీకు ఇచ్చిన మాటమేరకు తిరిగి రానిపక్షంలో "ఎవ్వని చూపుల మాత్రంచేత ఈ లోకం పుట్టుతూ ఉందో, ఎవ్వనిలో ఈ జగత్తు లయం చెందుతూ ఉందో అట్టి దైవమైన విష్ణువును కాదని, మరొక్కడిని సేవించిన పాపాన పడినవాడి నౌతాను"– అని శపథం చేసినాడు. దానికి రాక్షసుడు వెంటనే సమ్మతించి ఆ వ్రతి కట్లను విడిపించినాడు.

దాసరి తన గతజన్మల్లోని ఏ పాపం ఫలితంగానో ఇంతవరకు 'రోలగ్గెర' శిక్ష అనుభవించినాడు. రాక్షసుడు బంధనాలు తొలగించటంతో ఆ దోషం కాస్త తొలగిపోయింది. వెంటనే అతడు వడివడిగా దేవాలయానికి వెళ్లినాడు. పద్మపత్ర నేత్రునకు సాగిలబడి నమస్కరించినాడు. తన భక్తితత్పరత విష్ణువు మనస్సునకు ఎక్కునట్లుగా వీణను వాయిస్తు, స్తోత్ర గీతాలాపన చేసినాడు. అసత్యదోషం తనకు అంటకుండునట్లుగా త్వరత్వరగా రాక్షసుని దగ్గరికి వచ్చినాడు. తన వ్రతం పూర్తి అయిన సంతోషంతో ఇలా అన్నాడు.

ఓ ద్విజ నిశాచరా! నీ దయవల్ల బంధనంనుండి విడివడి వెళ్లి, చక్రధారియైన హరిని సేవించినాను. మోక్షానుభవం పొందినాను. ఇంక నేను ఏ బంధాల్లోను చిక్కుకోను. నీవు నన్ను పంపే సమయంలో నా కాళ్లు, కడుపు, ఎడద, తల, చేతులు ఎలా ఉండినవో అవి అట్లే ఏ లోపానికి గురికాకుండ ఉన్నాయో లేదో ఒక్కసారి సరిచూచుకో"– అన్నాడు.

### 3.8. రాక్షసుని పులకింత

దాసరి సత్యపాలనకు రాక్షసుడు ఆనందబాష్పాలు రాల్చాడు. అతని శరీరం పులకించి పోయింది. ఆ మిట్టమధ్యాహ్నవేళ, తీవ్రమైన ఎండ, వెంట్రుకల్లేని తన తలను పొడుస్తున్నా, లక్ష్యం చేయకుండ, చెట్టు దిగి పరుగు పరుగున వచ్చి మాలడిని సమీపించినాడు. ఏనుగు కొండను చుట్టి వచ్చునట్లుగా రాక్షసుడు దాసరిని భక్తితో ప్రదక్షిణ చేసినాడు. పైత్యం అధికమైన ఏనుగు ఏవిధంగా తనను కట్టి ఉంచిన చెట్టుచుట్టూ పలుమారులు తిరుగుతు, దాని మూలానికి తన నొసలు తగులునట్లు పడుతుందో, ఆ విధంగా రాక్షసుడు కూడ దాసరి కాళ్లపై పడినాడు. కొండలు ప్రతిధ్వనించేలా ఏనుగు రొదచేసినట్లు, రాక్షసుడు బిగ్గరగా అంత్యజుని స్తుతించినాడు. ఏనుగు ఒక్కొక్క పాదాన్ని ఎత్తి కోరలను తాకునట్లుగా దాసరి పాదాలను రాక్షసుడు ఒకదాని తర్వాత మరొక్కదానిని పలుమారులు తన శిరస్సున చేర్చుకొన్నాడు.

**కొండయు బోలె భక్తి వలగొంచుచు వాడు నిజద్రుమభ్రమీ**
**హిండన వ్రాలు పాకలపు టేనుగువోలె, నొసల్తదంఘ్రులం**
**దుండ రొదన్మహాగిరులు హోరన, ప్రస్తుతివ్రాలి, దంష్ట్రికా**
**దండము లెత్తి పట్టిన పదం బొక డొక్కడ నెత్తి చేర్చుచున్**

**ఆముక్త మాల్యద 6/47**

నేను వయో వృద్ధుడిని ఇప్పటికి ఎందరినో చూచినాను. వారి జీవన విధానాలు గమనించినాను ఈ లోకంలో ఇంతవరకు దేవతలు, రాక్షసులు,



రాజులు, మునులు ఎందరో ఎన్నెన్నో దానాలు చేసి తమ మాటను నిలబెట్టుకొన్నారు. కాని నీవలె శరీరదాన విషయంలో చేసిన ప్రతిజ్ఞను నిశ్చయజ్ఞానులై నెరవేర్చినవాళ్లు లేరు. నీవు మధురాతి మధురమైన హరిస్తోత్రాలను ఆలపిస్తున్నావు. ఈ దివ్యగానం అనే సముద్రం అలల్ని, సొరకాయకట్టిన నీ చేతివీణ అనే తెప్పచే దాటుతున్నావు. తిరుక్కురుంగడి కోవెలలో వెలసియున్న భగవంతుని అపారకరుణ నీకు పట్టు గొమ్మగా ఉంది. నీలోని ధైర్యం, ధారణ, సత్యనిష్ఠ, మురారి పదచింతన ఇతరుల్లో కనబడదు. భక్తి పరాయణతలో నీకు సాటి రాగలవారు లేరు – అని పలికి రాక్షసుడు పరమభాగవతుడైన దాసరిని కౌగిట చేర్చినాడు.

### 3.9. దాసరి రాక్షసుని ప్రశంసించుట

ఓ అసుర రాజా! బ్రాహ్మణప్రవరా! లోకం ప్రతిజ్ఞలు బండిచక్రాలవలె నిలకడలేనివి. ప్రాణభయంచేత మాటను తప్పుతూ ఉంటారు. నీ కృపా కటాక్షంవల్ల నేను సత్యవ్రతాన్ని నెరవేర్చి ధన్యుడనైనాను అతి ప్రయాసచే లభించిన ఆహారాన్ని ఎవ్వరూ వదలుకోలేరు. నీవు నాపై నమ్మకం ఉంచిన దొడ్డ బుద్ధిగల పుణ్యాత్ముడవు. 'పుణ్యజనుడు' అనే పేరు రాక్షసుల్లో నీ ఒక్కడితోనే సార్థకమైంది. నీ జన్మతో నీ కులం కీర్తి కెక్కింది.

పేరాకలిచే నీ కడుపు నకనకలాడుతూ ఉండగా, నీకు చిక్కిన నన్ను తినకుండ నాకోర్కెను మన్నించి హరిభజన ముగించుకొని వచ్చుటకై విడిచిపెట్టినావు. మానవులను మీకు ఆహారంగా బ్రహ్మ నియమించినాడు. అందువల్ల నన్ను తినడానికి నీవు సంసిద్ధుడు కావటంలో తప్పులేదు. నీకు ఏ పాపం అంటదు. నన్ను తినజాలనని నీవు పలకటం భావ్యం కాదు. నీకు నాపై ఏ మాత్రం సుహృద్భావం ఉండినా నన్ను తిను. నీ బడలికను తీర్చుకో. నా మాటల్లో ఏలాంటి తడబాటు లేదు. నేను త్రికరణశుద్ధిగా పలుకుతున్నాను. దీనికి ఆ భగవంతుడే సాక్షి. కాబట్టి నా దేహంలో సమృద్ధిగా

ఉండే మెదడును, క్రొవ్వెక్కిన మాంసాన్ని పారణ చేయి" – అని దాసరి చెప్పగా రాక్షసుడు ఖిన్నుడైనాడు.

## 3.10. తనను ఉద్ధరింపుమని రాక్షసుడు వేడుట

అయ్యా! దాసరీ! నీ మాటలు బలేగా ఉన్నాయి. ఈ దినం దాకా కించిత్తు కూడా దయలేని వాడినై మానవమాంసంతోనే ఈ పొట్టను నింపుకొని, పాపం మూటకట్టుకొన్నాను. ఎవ్వడైనా ఒక గొప్ప తపోధనుడో, ఒక వ్రతనిష్ఠ గలవాడో, ఇక్కడికి రాకుండా పోతాడా? అతని దయవల్ల నా జన్మను తరింప జేసికోలేకపోతానా? అంటూ ఇన్నాళ్లూ ఎదురుచూస్తూ ఉండినాను. పుణ్యాత్ముడైన నీ కారణంగా నా ఆశ నెరవేరుతుందని నమ్మినాను. కాని నిన్ను తినుమని నన్ను ఒత్తిడి చేస్తున్నావు. ఇదేమైనా బాగుందా? ఓ మహానుభావా! ఆ విధంగా పలుకవద్దు. మీ వంటి భాగవతులు మావంటి నికృష్టులను పావనులుగా మార్చకపోతే, ఇక మాకు దిక్కెక్కడిది? ఇన్నాళ్లు నేను సాగించిన హేయమైన పనుల్ని మనస్సులో పెట్టుకోకుండ నన్ను కరుణతో చూడు. పరుసవేది నిరపరాధియైనవాని గొడ్డలి ఇనుమునుగాని, బ్రహ్మహత్య గావించిన మహాపాపియొక్క కత్తి ఇనుమునుగాని బంగారంగా మార్చగలదు. ఈ మహోన్నత న్యాయాన్ని పాటించి పరుసవేదివంటి మీరు ఇనుమును పోలిన నన్ను బంగారంవలె స్వచ్ఛంగా మార్చవలసి ఉంది. కాబట్టి నాపై అనుగ్రహం చూపండి. పాపినైన నన్ను గట్టెక్కించండి– అని దీనంగా వేడుకొన్నాడు.

అప్పుడు దాసరి – దేహాన్ని సమర్పించటానికి సిద్ధమైన నన్ను నీవు వద్దంటున్నావు. దుఃఖిస్తూ పశ్చాత్తాపం చెందుతున్నావు. ఇంతకు నీకు కావలసిందేమిటి? స్పష్టం చేయి – అని అనగా – ఒక జీవుని పాపంనుండి విముక్తుణ్ణి చేసి, పరిశుద్ధునిగా చేయటమే నిజమైన దయ అవుతుంది. అంతేగాని – నా దేహం మాంసంతో నీ ఆకలి తీర్చుకో అనటం సరి కాదు.



మునులను ఎందరినో ఆట ఆడించిన ఘంటాకర్ణునికంటె మించిన పాపాన్ని నేను చేశానా? అయినా శ్రీకృష్ణుడు అతని దుశ్చర్యల్ని పోగొట్టి అతనికి మోక్షాన్ని ఇచ్చాడు కదా! నీవు హరిభక్తుడవు కావటంతో హరికంటె ఎక్కువ వరాలు ఇవ్వగల సమర్థుడివి. ఒక ప్రాణిని సంతోషపెట్టటం కూడ హరిపూజతో సమానమే. కాబట్టి నీవు నాకు మేల చేయి. అది హరిపూజకంటె మించిన పుణ్యాన్ని కలిగిస్తుంది – అన్నాడు. అట్లైతే నేను నీకు చేయగల ఉపకారం ఏమిటి? అనిన మాతంగునకు రాక్షసుడు ఇట్లా అన్నాడు.

## 3.11. రాక్షసుడు హరిగాన ఫలం కోరుట

నేను బ్రహ్మరాక్షసుడిని. నా పేరు కుంభజానుడు. ఉగ్రకర్ముడను. ఈ వటవృక్షం ముసుగులో ఎందరో బాటసారుల్ని మోసగించి భక్షిస్తూ ఉంటాను. వెనుకటి జన్మలో నేను సోమశర్మ అనే బ్రాహ్మణుడిని. ఒకానొక దుష్కర్మకారణంగా నాకు ఈ రాక్షస జన్మ వచ్చింది. నీవు విష్ణువును గూర్చి పాడిన పాటవల్ల పొందిన పుణ్యఫలాన్ని ధారాపూర్వకంగా నాకు ఇచ్చినట్లైతే, నిందకు కారణమైన ఈ జన్మ తొలగిపోతుంది. దీనివల్ల ఆర్తులను రక్షించిన పుణ్యం నీకూ దక్కుతుంది. సత్యానికి ధర్మానికి సాధనమైన ఈ శరీరం తరిస్తుంది – అనగా అతని మాటలకు విష్ణుదాసుడు కలకల నవ్వి ఇలా అన్నాడు.

ఇందాకా నే నెత్తిన శరీరాలు లెక్క లేనన్ని. అందులో కొన్ని ఉత్కృష్టమైనవి, మరికొన్ని అధమమైనవి ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పటికి మాలదాసరి జన్మ కలిగింది. ఇట్టి పుట్టుకలకు విరామం పొందవలసి ఉంది. దానికై హరికీర్తనం ఆధారంగా చేసికొన్నాను. కాబట్టి నా పుణ్యఫలాన్ని నీకు రవ్వంతకూడ ఇవ్వలేను.

మనం విష్ణుభక్తులం కాకపోవటంతో ఎన్నోమారులు దిక్పాలకులుగా, బిచ్చగాండ్రుగా, సింహాలుగా, పురుగులుగా, ఏనుగులుగా, దోమలుగా, రాజులుగా, దాసులుగా, సోమయాజులుగా, కుక్కమాంసం తినే పక్షులుగా

జన్మం ఎత్తినాము. ఒకపాటి పుణ్యం చేసిన కారణంగా కాస్త ఉత్తమజన్మను, పాపాలు చేయడంతో అధమజన్మను పొందుతూ వచ్చాము. అతిదుర్లభం అయినా అవశ్యం కోరదగింది హరిసేవయే. దానివల్ల క్షుద్రమైన పుట్టుక అనేది ఉండనే ఉండదు.

ఈ దేహం వలలోని నీటిలా, సాలెపురుగు నేసిన బట్టలో దాచి పెట్టిన దూది, ఎండలోని పసుపులా, చెక్కలో పురుగులు తొలిచిన అక్షరంలా ఏ మాత్రం శాశ్వతం కానివి, విలువ లేనివి. అట్టి ఈ శరీరానికి పునర్జన్మ లేకుండటానికై విష్ణుగానఫలం చేత సంపాదించుకొన్న పుణ్యఫలాన్ని నీకు అమ్మి, మరల దేహధారి కావటం కప్పురాన్ని అమ్మి ఉప్పును కొన్నట్టిది అవుతుంది – అన్నాడు.

**ఊతనీరు, చెలదినేత మూటాయిది**
**దూది, ఎండపసుపు, తొట్టి అక్క**
**రంబు మేను, దీని రహి పుణ్య మమ్ముట**
**కప్పురంబుపెట్టి ఉప్పు గొనుట**

అయ్యా! గోసంగీ! చేప గ్రుక్కెడు నీళ్లు మ్రింగినంత మాత్రాన సముద్రానికి కొరత రాదు గదా! అపారమైన నీ హరికీర్తనా ఫలానికి కొదువేమీ ఉండదు.

**సంగీత ఫలంబున గో**
**సంగీ సగమైన దయవొసగ నీవే మీన్**
**మ్రింగిన గ్రుక్కన్ వారిధి**
**కిం గొఱతయె కొదయె విష్ణుకీర్తన కనినన్**

**(ఆముక్తమాల్యద, 6/64)**

కాబట్టి నీవు ఒకనాడు దేవుని గూర్చి పాడి, పొందిన పుణ్యంలో సగమైనా ప్రసాదించు – అని రాక్షసుడన్నాడు. బదులుగా దాసరి – 'నీవు నా దేహాన్ని తప్ప మరొక్కటి అడుగకూడదు. నన్ను విష్ణుసేవకై నీవు అనుమతించి పంపేటప్పుడు, తిరిగి వచ్చి దేహాన్ని ఇస్తాను అన్నానే గాని, గానఫలం ఇస్తాను అనలేదు. కాబట్టి నీవు తర్కం మాని నా దేహాన్ని తిను. నీవు పిశాచ జాతికి చెందిన వాడివి కావటంతో లేనిపోని వంకర మాటలు పలుకుతున్నావు. నాకు కోపం తెప్పించవద్దు. అలా చేయటంవల్ల బావిని త్రవ్వి బేతాళుణ్ణి లేపినట్లవుతుంది. నీ యుక్తి ఫలించదు. గుర్తుంచుకో అనగా రాక్షసుడు దుఃఖానికి లోనై, కార్యసాధనకై కన్నీరు కార్చుతూ ఇలా అన్నాడు.



### 3.12. రామానుజాచార్యుల సేవల ప్రస్తుతి

విష్ణుసేవకులు దయాళువులై ఉండాలి. షడ్దర్శనాలను, వ్యాస విరచితమైన బ్రహ్మసూత్రాలను, శ్రీమన్నారాయణుని అద్వైత వైశిష్ట్యాన్ని, రామానుజాచార్యులవారు లోకంలో ప్రతిష్ఠించినాడు. ఎంతోకాలంగా తన గురువైన పూర్ణాచార్యులు (పెరియనంబి)ను సేవించి, సంతోషింపచేయగా, ఆయన రామానుజాచార్యులకు విధియుక్తంగా గీతా చరమార్థాన్ని బోధించినాడు. దీనిని అనధికారులకు ప్రసాదించకుమని కట్టడి పెట్టినాడు. కాని లోకులందరికి మేలగుగాక! అని కరుణాంతరంగుడై శ్రీ రంగేశ్వర దేవాలయగోపురం ఎక్కి బిగ్గరగా గురూపదేశాన్ని వినబడునట్లు చేసి, గురువు కోపానికి కారణమైనాడు. గురుదేవా! మీ ఆజ్ఞ జవదాటటంతో నేనొక్కడినే రౌరవమనే నరకంలో పడుతాను. కాని భాగవత పరిషత్తు యావత్తు పరమపదాన్ని పొందటం ఎంతో మేలు కదా! అని భావించి మీ పేరు మీదనే దానిని అందరికి అందించినాను. అనగా ఆ దేశికోత్తముడు శిష్యుని అభినందించినాడు.

శ్రీరామనుజాచార్యులవారు తన శిష్యకోటికి ప్రతిదినం ప్రాతఃకాలంలో పాలు, పెరుగు, నేయి, మొదలైన గవ్యాలు ఉచితంగా సమర్పించిన గోపగోపీ జనులకు నిశ్శ్రేయసాన్ని ప్రసాదించినాడు. ఆయనే కాలాంతరంలో సంకుచిత

జ్ఞానులై విషయలోలురై దిగజారుతున్న వారికి అర్చనా విధానాలను విశదీకరించినాడు. విష్ణువుచే వాదభిక్ష అభ్యర్థించి యాదాద్రిపై కాలుమోపిన పాషండులను ఓడించినాడు. శ్రీహరి నివాసమైన గురుడాచలంయొక్క గుహ అనదగిన అహోబిల మఠంలో జపాసనం, కాషాయవస్త్రం, జల కమండలువు, ధరించి, కపట సన్యాసులై ఉన్న వంటబ్రాహ్మణులకు, శిష్యప్రశిష్యులకు, యత్యా శ్రమవాసులకు ఎన్నో శాస్త్ర విషయాలు ప్రభోధ పరచి మార్చినాడు. ఆయన బోధించిన వాటిలో శేషుని అష్టాధ్యాయి, కణాదుని వైశేషికం, గౌతముని న్యాయం, కపిలుని సాంఖ్యం, జైమిని పూర్వమీమాంస మొదలైన శాస్త్రాలు ఉన్నాయి. రామానుజయతీంద్రులు తమ అనుష్ఠానానికి పరాకాష్ఠయా! అనదగిన రీతిలో భక్తుల హృదయ క్షేత్రాల్లోని కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలైన అరిషడ్వర్గాలు అనే పల్లేరుముళ్లను పెరికివైచినాడు. అచ్చట లక్ష్మీనారాయణులను శాశ్వతంగా ప్రతిష్ఠించినాడు. ప్రపత్తిమార్గాన్ని తిరుగులేనిదిగా ఉపదేశించినాడు.

ఆ పిమ్మట హయగ్రీవస్వామి పాదపద్మాలను నిరంతరం సేవించే వేదాంతదేశికులు అనబడే మరొక్క జ్ఞాని వచ్చి, నారాయణుని మించిన పరతత్త్వం మరొక్కటి లేదని చాటుతూ నూరు గ్రంథాలు రచించగలడు. కోతకోసిన పిమ్మట రాలిపడిన పరిగలను, నీహారాది ధాన్యాలను ఆహారంగా తీసికొనే తనకు, ముదురాకులను శాకములను భోజనానికై ప్రసాదించే అవిశచెట్టుకు మోక్షాన్ని ప్రసాదించగలడు – అంటూ ఎన్నో విషయాలను ప్రసక్తికి తెచ్చినాడు.

సమీప భవిష్యత్తులో జరిగే కొన్ని ఘటనలను నా దివ్యబోధ వల్ల తెలిసికో గలుగుతున్నాను. ఇట్టి త్రైకాలిక జ్ఞానంచేతనే ఈ శరీరం మాననీయం అవుతుందని నీవు అంటావేమోగాని, ఇది జాత్యమే తప్ప, తపస్సు, సత్యం, శౌచం, శమం, దమం మున్నగువానివల్ల లభించేది కాదు. ఎందుకంటే



ఎఱుకతె గూడ భవిష్యదర్థం చెప్తూతూ ఉంది. ఆమెను 'శుచి' అనగలమా? అట్లే డబ్బగాడు, గబ్బులుగు, కనుంబెంటి, పైడికంటి మొదలైన అపశకున పక్షులు కూడ భావిప్రయోజనమైన సూచనలు చేస్తున్నాయి. అవి తపస్వులా? కాదు కదా! అట్లే నా విజ్ఞానమూ అంతంత మాత్రమే.

నాస్తికత వల్ల శాస్త్రాధ్యయన బోధనలు తప్ప ఆచరణ ప్రచారాలు ఉండవు. దానివల్ల ధర్మం దూరం అవుతుంది. ఆచరణ ప్రచారాలు ఉంటేగాని జన్మ సార్థకం కాదు. కాన నా ఈ వికృతరూపాన్ని దయతో పోగొట్టి నన్ను కృతార్థుణ్ణి చేయి – అని దాసరి పాదాలపై వ్రాలినాడు. పాటలోని పాతికభాగమైనా ఇమ్మని కోరగా దాసరి అదీ కాదన్నాడు. కనీసం ఈ తెల్లవారు జామున పాడిన పాటలోని చివరిపాదం యొక్క ఫలమైనా ఇవ్వడానికి ప్రసన్నుడివై, విపన్నుడి నైన నన్ను ఉద్ధరింపుమని పాదాలపై పడి లేవలేదు. అప్పుడు దాసరి దయాంతరంగుడై అట్లే కానిమ్మని లేవనెత్తి. ఈ రాక్షసత్వం నీకు రావడానికి కారణం ఏమిటో సవిస్తరంగా చెప్పు మనగా, ఆ రాక్షసుడు దుఃఖార్తుడైన తన గాథను ఇలా వివరించాడు.

### 3.13. బ్రహ్మరాక్షసుని ఆత్మకథ

నేను పూర్వజన్మలో సోమశర్మ అనే బ్రాహ్మణుడిని. చోళదేశ వాసిని. పద్నాలుగు విద్యల్లో నేర్పరిని. నోటి బలంతో తార్కికుల నోరు మూయించే వాడిని. యాగ తంత్రజ్ఞులను తప్పుపట్టే వాడిని. ప్రయోక్తల్ని ఎగతాళి చేసేవాడిని. కొద్దిపాటి విద్యల్తో పెద్దల్ని కించపరచే వాడిని. ఓడిపోయి కూడ గెలిచానని అబద్ధాలాడి చిల్లర రాజుల్ని భ్రమపెట్టి డబ్బు సంపాదించే వాడిని.

ఒకమారు యజ్ఞ నిర్వహణకై ధనం సంపాదించాలని మధురానగరం వెళ్లాను. కులంలో వెలివేయబడ్డ బ్రాహ్మణునికి కొంచెం ప్రాయశ్చిత్తం ఇచ్చి, కొద్దిపాటి డబ్బుకోసం వాని బంతిలో తిని, డబ్బున్న వాళ్ల చుట్టు తిరిగి,

పుణ్యఫలాన్ని వారికి ధారపోసినాను. శ్రాద్ధభోజనాలు, పితృశేషాలు తింటూ, దొరికిన చోట్ల దొరికినట్లుగా వస్తువులు గుంజి, డబ్బు కూడబెట్టి ఒక కోమటికి వడ్డికి ఇచ్చాను. కొన్నాళ్ల తరువాత మా ఊరికి వెళ్లాలని డబ్బు అడిగాను. నేనిచ్చిన వస్తువులకు వాడు తక్కువ ధర ఇచ్చాడని దెబ్బలాడి, వాడిని రచ్చ కీడ్చి, అధికంగా డబ్బు వసూలు చేశాను. ఒక దొంగ ఇదంతా కనిపెట్టాడు. నా ధనం దోచుకోవాలని పథకం సిద్ధం చేసికొన్నాడు.

మరసటిదినం వేకువజామునసే మా ఊరికి వెళ్లేవాళ్లతో కలిసి ప్రయాణమైనాను. ఆ దొంగ ఒక సంచితో మా గుంపులో చేరాడు. అంతకు ముందే మా దారిని అడ్డగించటానికి వాడు కొందరిని ఏర్పాటుచేశాడు. నా మూటల్ని ఒక బ్రహ్మచారి నెత్తికి ఎత్తాను. అందరం బయలుదేరాము. ఆ దొంగ అటు, ఇటు, అంటు దారిని చూపిస్తూ, మేమందరం ఏటిలోకి దిగగానే ఈల వేసినాడు. అప్పటికి తెల్లవారింది. మా మీద రాళ్లు బాణాలు పడ్డాయి. అందరం ఆగిపోయాం. దొంగలు మమ్మల్ని చుట్టుముట్టారు. గుంపులోని కొందరు భయపడి పారిపోవటానికి ప్రయత్నించారు.

నేను నా మూటలు మోస్తున్న బ్రహ్మచారిని వదలిపెట్టి, డబ్బు మూటతో, పెద్ద పొట్టతో అవస్థపడుతూ పారిపోతున్నాను. కాకి మీసాలుగల ఒక దొంగ నా వెంట బడ్డాడు. కత్తితో నా మెడిమల కొంకుల్ని నరికాడు. నేను క్రింద పడిపోగానే, నా పొట్టమీది దోవతిలో దాచుకొన్న వరహాల సంచిని లాక్కున్నాడు. తలపై గట్టిగా బిగించుకొన్న టోపీని కూడ డబ్బులున్నాయేమో అని గట్టిగా పీకాడు. దాంతో నా రెండు చెవులూ సమూలంగా ఊడి పోయాయి. డబ్బుతో దొంగ పారిపోతూ ఉంటే – ఓరే మా ఊరి పొరుగువాడివై ఉండి మమ్మల్నే మోసం చేస్తావా? నా సొమ్ము నీకు ఎలా దక్కుతుందో చూస్తా – అన్నాను. అది విని వాడు నేను ఎక్కువడబ్బు పోగొట్టుకున్నానేమో, రాజుకు చెప్పి పట్టిస్తానేమో అని నన్ను చంపడానికి వచ్చాడు.



ఈ లోగా కొద్ది దూరంలో బాటసారులు కనిపించేటప్పటికి, తొందర తొందరగా నామీద పడి కత్తితో నాలుగు పోట్లు పొడిచి పరుగుతీశాడు. ఆ గుంపులో ఉండే నా బావమరిది నా నిర్వాకానికి తిట్టి నన్ను కావడికి ఎత్తుకొని పోతున్నాడు. దారిలో వాడికి దప్పిక కావటంతో, ఒక చెట్టునీడలో కావడి దించి నీళ్లు త్రాగడానికి వెళ్లాడు. ఇంతలో నా ప్రాణం పోయింది. వాడు తిరిగి వచ్చేటప్పటికి నేను బ్రహ్మరాక్షసుడిని అయ్యాను. చివరగా దొంగయొక్క భయంకరమైన ఆకారాన్ని చూస్తూ మరణించటంతో నాకు ఆ రూపం వచ్చింది – అని చెప్పాడు.

**యం యం వాపిస్మరన్ భావం**
**త్యజత్యన్తే కళేబరమ్**
**తం తమేవైతి కౌన్తేయ**
**సదా తద్భావభావితః**

**(భగవద్గీత, 8/6)**

(మరణ కాలంలో ఏ భావాన్ని చింతిస్తూ ఒకడు దేహాన్ని విడుస్తాడో, వాడు అట్టి భావంచే ఏర్పడిన సంస్కారాన్ని కలిగి ఉండటంవల్ల ఆ రూపాన్నే పొందుతున్నాడు) శ్రీకృష్ణసూక్తి ఇక్కడ సత్యమైంది.

### 3.14. బ్రహ్మరాక్షసునకు శాప విముక్తి

మంగళకైశికీ ఫలాన్ని తనకు దత్తం చేసి, తన బ్రహ్మరాక్షసి రూపాన్ని పోగొట్టుమని కోరిన బ్రహ్మరాక్షసునితో దాసరి – పరమేశ్వరుని సంతోష పెట్టుటయే భక్తుని సేవకు ప్రయోజనం. ఆ పరంధాముడే నిన్ను కాపాడుతాడు – అని అంటూ ఉండగానే బ్రహ్మరాక్షసుడు తన పూర్వరూపం పొందినాడు. ఆ రూపం:–

**స్నిగ్ధ త్రిభాగ ముండిత శిరశ్శిఖ తోడ**
**హిమ ధవళోపవీతముల తోడ**

**పుణ్యషడ్ద్వితయోర్ధ్వ పుండ్రవల్లుల తోడ**
**తులసికాబ్జస్రగావళుల తోడ**
**కౌపీన కటినూత్ర కాషాయముల తోడ**
**జలపూర్ణ శుభకమండలువు తోడ**
**పాణిస్థ దివ్యప్రబంధ సంపుటి తోడ**
**ఉత్తరవాక్పూర్వకోక్తి తోడ**
**పసిడి జిగితోడ బ్రహ్మవర్చసము వొల్చు**
**భాగవత లక్ష్మితో ధూమపటలినుండి**
**వెడలు శిఖవోలె నమ్మేను వెడలిచూడ**
**జూడ వైష్ణవుడై నిల్చె సోమశర్మ**

**(ఆముక్త మాల్యద,7/23)**

'సోమశర్మ శిరస్సు మూడుపాళ్లు క్షౌరమై, ఒక పాలు జుట్టుతో ఉంది. యజ్ఞోపవీతాలు మంచువలె తెల్లగా ప్రకాశిస్తూ ఉన్నాయి. పవిత్రాలైన పండ్రెండు నిలువుబొట్లతో, అతనిదేహం సువర్ణచ్ఛాయతో ప్రకాశిస్తూ ఉంది. తులసి తామర పూసలదండలు అతని మెడలో అధికంగా ఉన్నాయి. అతడు ధరించిన కౌపీనం, మొలనూలు కాషాయం రంగులో ఉన్నాయి. మాంగల్యకారణమైన అతని జలకుండిక తీర్థోదకంతో నిండి ఉంది. అతడు 'ద్వయమంత్రం' యొక్క ఉత్తరవాక్యాన్ని అనుసంధానం చేస్తూ ఉన్నాడు. అతని సహజమైన బ్రహ్మవర్చస్సుకు, వైష్ణవతేజం మరింత వన్నె కూర్చింది. అలా రాక్షసదేహం నుండి విష్ణుశర్మ విడివడి, పొగనుండి వెలువడే అగ్నిజ్వాలవలె ప్రకాశిస్తూ ఎదుట నిలిచాడు

### 3.15. సోమశర్మ దాసరిని సంస్తుతించుట

భాగవత పరిచయ ప్రభావం చేత బ్రాహ్మణ్యమేకాక, భాగవత సంపద కూడ బ్రాహ్మరాక్షసునకు ఒనకూడింది. ఉప్పురాలిన మట్టికూడ ఉప్పైనట్లుగా సోమశర్మ పరమానందం పొంది దాసరిని పూజించి ఈ విధంగా స్తుతించినాడు.



**జయ దురుత్తరణ సంసరణాబ్జదళ నీర!**
**జయజయ గాయక సార్వభౌమ!**
**జయ శౌరిగాథా రసజ్ఞ పుణ్యరసజ్ఞ!**
**జయజయ తత్త్వసంచయ పవిత్ర!**
**జయ జనార్వాచీన జని సంగ వంచక!**
**జయజయ దేశిక చరణ శరణ!**
**జయ యుక్తవాక్ప్రతిష్ఠా తృణీకృతదేహ!**
**జయజయ భగవదాజ్ఞాకృతిస్థ!**
**జయ సకలజంతు సమచిత్త జయ దయార్ద్ర!**
**జయ ముకుందాన్యదేవతా శాస్త్ర బధిర!**
**జయ చతుర్ద్వయ భక్తిలక్షణ చితాంగ!**
**జయ మురారిప్రసన్నాంఘ్రి జలజ మధుప!**

**(ఆముక్త మాల్యద,7/25)**

ఓ మహానుభావా! నీవు సర్వోత్కృష్టుడవు. దాటుటకు వీలుకాని ఈ జనన మరణ రూప సంసారంలో నీవు తామరాకుపై నీటి బొట్టులా అంటీ అంటనట్లున్నావు. హరి భజనను గానం చేసే వారిలో నీవు ఉత్తముడవు. హరి గీతాగాన మాధుర్యం తెలిసిన నీ నాలుక పవిత్రమైంది. తీగలు కొడవలిచే సునాయాసంగా తెగిపోవునట్లు, తత్త్వసంశయాలన్నీ నీవల్ల విడిపోతాయి. నీవు ఎంతో మహిమ కలవాడవై కూడ తక్కువకులం ముసుగులో ఇతరులకు నీ గొప్పతనాన్ని తెలియనీకుండ చేస్తున్నావు. నీవు గురుచరణాలే సర్వశరణ్యంగా నమ్ముకొని ఉన్నావు. గురూపదేశంపై అచంచలమైన విశ్వాసాన్ని నిలిపి, దానిని చక్కగా శ్రద్ధతో అనుష్ఠిస్తూ, తత్త్వాన్ని నీ అనుభవం లోకి తెచ్చుకొన్నావు. నీవు నీ ప్రతిజ్ఞను నెరవేర్చటానికై నీ దేహాన్ని తృణప్రాయంగా వదలడానికి సిద్ధమైన వాడివి. భగవదాజ్ఞను లేశమాత్రం కూడ విస్మరించకుండ శిరసావహించడమే నీ వ్రతంగా జీవిస్తున్నవాడివి.

సకల ప్రాణులందు సమభావం కలవాడివి. దయార్ద్ర హృదయుడివి. నారాయణుని కంటె వేరే దైవం ఉన్నాడని చెప్పే వారి మాటల్ని విశ్వసించవు. హరిభక్తుల పాదపద్మాలను కొలిచేవాడివి. భాగవతవాత్సల్యం, భగవత్పూజయందు అనుమోదం, భగవదర్చన, భగవద్విషయ దంభరాహిత్యం, భగవత్కథా శ్రవణేచ్ఛ, సర్వనేత్రానంద వికారం, సదా భగవన్నామస్మరణం, అమాంసభక్షణం – అనే అష్టవిధ భక్తి లక్షణాలతో ప్రకాశిస్తున్న వాడివి – అంటూ దాసరికి ప్రదక్షిణ చేసినాడు.

మరల జన్మనెత్తు దుస్థితినుండి తప్పించుకో దలచినాడు. భార్యావిముఖుడై లౌకిక సుఖాలను విడిచినాడు. పురుషోత్తముడు అధివసించి ఉండే బదరీవనం వంటి పుణ్యక్షేత్రాలను మరల మరల దర్శిస్తూ, తీర్థయాత్రలు చేస్తూ మోక్షాన్ని పొందినాడు.

# ద్వితీయభాగం-విశ్లేషణ

## 4. కథా ప్రాశస్త్యం

కులప్రధానం, అగ్రవర్ణాల ఆధిపత్యంగల ఆ దినాల్లో ఒక చక్రవర్తి 'కులం ప్రధానం కాదు, గుణమే మహోన్నతమైంది. అట్టి భాగవత శిరోమణులకు ప్రణామాలు' అనే ప్రాతిపదికమీద తన 'ఆముక్తమాల్యద' ప్రబంధంలో 'మాలదాసరి కథ' నడిపినాడు. ఈ వృత్తాంతం ఎడారిలో 'ఒయాసిస్సు' లాంటిది. సాధారణ కథలకు భిన్నంగా పాఠకులను సేద తీర్చుతుంది. సమాజంలో అట్టడుగు జాతిగా ముద్రపడిన కులస్థునికి, కథా నాయకుడి స్థానం కట్టబెట్టి, ప్రతినాయకుడుగా ఉన్నతకుల సంజాతుడిని నిలబెట్టినాడు రాయలు. ఇందులోని పాత్రల ఉదాత్తస్వభావం, మాటల్లోని పరిపక్వత, చురుకుదనం మనల్ని బాగా ఆకర్షిస్తాయి.

మాలదాసరి కథను గూర్చి, జ్ఞానపీఠ పురస్కారగ్రహీత విశ్వనాథ సత్యనారాయణగారు – ఇట్టి కథ ఆముక్తమాల్యదామహాకావ్యంలో మాత్రమే



ఉండటం సాధ్యం. రాయలు తప్ప అటువంటి రచనను కావ్యజగత్తులో ఎవ్వరూ సృష్టించలేరు – అన్నారు. ఈ కథను మనసుపెట్టి చదివిన వారికి మాత్రమే ఈ వ్యాఖ్యలోని ఔచిత్యం బోధపడుతుంది.

కన్నడదేశంలోని సుప్రసిద్ధ భక్తుడైన కనకదాసు శ్రీకృష్ణదేవరాయలకు ఆంతరంగికుడు. కనకదాసుకు లభించిన ప్రశస్తికిగల కారణాల్లో రాయలు రచించిన మాలదాసరి కథారచన కూడా ఒకటి అనిపిస్తుంది. పదవీ ఔన్నత్యంతో, దివ్య వ్యక్తిత్వాలతో వెలుగొందిన ఆ ప్రభువులో, కనకదాసు ద్వారకా కృష్ణుని దర్శించినాడు. పారవశ్యానికి లోనై తన "మోహన తరంగిణి" కావ్యంలో రాయల వైభవవిలాసాలను శ్రీకృష్ణుని మహద్విలాసాలుగా వర్ణించినాడు. ఆ ఇరువురి మధ్య అభేదం కల్పించి స్తుతించినట్లు కన్నడ కావ్యవిమర్శకులు అభిప్రాయపడినారు. విష్ణ్వంశతో రాయలు జన్మించినాడని ఆయన సమకాలికులు భావించినప్పుడు, రాయలుకు ఆత్మీయుడైన కనకదాసు వేరుగా భావించలేడు కదా!

అజ్ఞానులైన అగ్రవర్ణీయులు కొందరు కనకదాసును అవహేళన చేశారని ప్రచారంలో ఉన్న కథలనే పథ్యం వాస్తవమైతే, ఆ సంఘటనలు రాయలుకు మనస్తాపం కలిగించి ఉండటమూ సహజమే. అలాంటి ఛాయలేమైనా ఆముక్తమాల్యదలో లభిస్తాయేమో అని వెదకితే ఆశ్చర్యకరమైన ఒందు రెండు వాస్తవాలు బయట పడుతాయి. విగ్రహరూపంలోను, ప్రచారంలోను ఉన్న కనకదాసు వేషభాషలకు రాయలచేత వర్ణింపబడిన మాలదాసరికి దగ్గరి పోలికలు ఉన్నాయనేది మన దృష్టికి వస్తుంది. క్రింది పద్యం చూడండి:

**చమురైన తోల్కుబుసంబు టెక్కియును, ని**
**త్తడి శంఖ చక్ర కుండలము లమర**
**దివెదారికొమ్ము తోల్తిత్తియు జోడమ్ము**
**మెడమీది మొగలాకుగొడుగు దనర**

**మత్పాదరక్షయు మావుపెన్వెఱక క**
**ట్టిన ఓటి తిరుదండెయును మెఱయ**
**చిటి తాళములు చంకపుటిక నొక్కొకమాటు**
**గతి రయంబున తాకి కలిసిమొరయ**

**వలుద వనమాల కంటెయు మలినతనువు**
**పట్టె తిరుమన్ను బెదరుకెంబుట్టుచూపు**
**పసుపుపొడి తోలువల్లంబునెసకమెసగ**
**వచ్చుసేవింప సురియాళు వైష్ణవుండు**

**(ఆముక్త మాల్యద, 6/6)**

రాయలసమకాలీనుల్లో మహాజ్ఞాని, గొప్పభక్తుడూ అయిన అధమవర్ణుడు అవమానితుడు కనకదాసే. ఆయనను దృష్టిలో ఉంచుకొనే రాయలు మాలదాసరి వంటి సజీవపాత్రను సృష్టించాడు కాబోలు అనిపిస్తుంది. సునిశిత పరిశీలకులకు, ఇది వాస్తవానికి దగ్గర వున్నట్లు కూడ తేటతెల్లమవుతుంది. తనను మోహనతరంగిణిలో నిబద్ధుణ్ణి గావించి కావ్యాన్ని నిర్మించిన కనకదాసుపట్ల రాయలు పెంపొందించుకొన్న ఆత్మీయతా వినమ్రభావం రాయలచేత కనకదాసు ప్రతిరూపంగా మాలదాసరి పాత్ర మలచబడింది అనడం అతిశయోక్తి కాజాలదు.

అగ్రవర్ణీయులను చూచినవెంటనే ముకుళిత హస్తుడై దూరంగా తొలగిపోయే మాలదాసరిని భావించినప్పుడు సున్నితమైన రాయల కవితాహృదయం క్షోభ చెంది ఉంటుంది. కర్తవ్యవిముఖుడైన బ్రహ్మరాక్షసుని మాలదాసరితో పోల్చి, దాసరి మహనీయతను పూసగ్రుచ్చినట్లు వివరించినాడు. దైవ సాన్నిధ్యం కోసం పరితపించిన మాలదాసరి మహాత్ముడని రాయలు చాటి చెప్పినాడు. కడజాతివాని ద్వారా బ్రాహ్మణునకు పూర్వ రూపాన్ని ఇప్పించడంలో విష్ణుభక్తిలోని పారమ్యాన్ని చాటడమే కాక కులంతో నిమిత్తం లేకుండ ఉన్నతగుణాలు ఎందైనా ఉంటాయి. వాటిని అన్వేషించండని రాయలు చెప్పదలచినాడు.



వరాహ పురాణంలో రేఖామాత్రంగా దర్శనమిచ్చే మాలదాసరి కథకు ప్రాణప్రతిష్ఠ చేసి, దానిని అగ్రగామిగా నిలిపినాడు. సోమశర్మ యజ్ఞం చేస్తూ అది పూర్తి కాకుండానే దీక్షాదినాలలో మరణించడంతో బ్రహ్మరాక్షసుడైనట్లు చెప్పిన పుణ్యకథలో పస లేదని గ్రహించి పూర్తిగా మార్చి ప్రబంధీకరించినాడు. బహుశా, రాయలు తన కాలంనాడు తాను చూచిన ఒక భ్రష్ట బ్రాహ్మణుని కథను దీనితో అనుసంధానము చేసినాడు కాబోలు.

## 5. శీర్షిక నామౌచిత్యం

ప్రాచీన కవులు తమ పద్య గ్రంథాలను నిడివిగా వ్రాసికుంటూ వెళ్లుతారే తప్ప కథాంశాలను శీర్షికలను సూచించరు. కాని ఆశ్వాసాంత గద్యలో వాటిని పేర్కొంటారు. ఈ పద్ధతైనా తప్పనిసరిగా అందరు పాటిస్తారు అనడానికి వీలు లేదు. అసలు శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో ఆశ్వాసాంతగద్య వ్రాయనే లేదు. ఆశ్వాసాల మొదట చివర కృతిపతిస్తవం మాత్రం చేసినాడు.

బ్రహ్మరాక్షసుని విమోచనకు ప్రధానకారణమైన మాలదాసరి వృత్తాంతం ఆముక్తమాల్యదలోని సప్తమాశ్వాసంలో వస్తుంది. ఈ ఘట్టానికి 'మాలదాసరి కథ' అని ఎవరు నామకరణం చేశారు? ఎందుకు చేశారు? అన్నది ఆలోచింప వలసి ఉంది.

ఈ కథామూలం వరాహపురాణంలో ఉంది. కథాకాలం నాటికి కులవ్యవస్థ ఉన్నా, కులమే ప్రధానంగా సూచింపబడేటట్లుగా ఈ సన్నివేశానికి 'మాలదాసరి కథ' అని నామకరణం చేసి ఉంటారనుకోవడానికి వీలులేదు. ఈ పని రాయలే చేసినాడా అనడానికి ఆస్కారం లేదు. శ్రీకృష్ణదేవరాయలు ఈ ఘట్టంలోని కథానాయకుడైన దాసరిని ఉద్దేశించి వివిధ సందర్భాలలో పదునెనిమిది నామవాచకాలను వాడినాడు.

వానిలో కులాన్ని తెలియజేసేవి – సురియాళుడు (మాలవాడు); దివాకీర్తిజని (మాలవాడు, మంగలవాడు); మాతంగుడు (మాదిగవాడు); గోసంగి (మాదిగవాడు, ఆసాదివాడు) ప్రత్యేకించి కుల నిర్దేశం చేసే విధంగా కాకుండ తక్కువ కులం వాడని మాత్రం చెప్పే – హీనకులుడు, హీనజన్ముడు అంత్యకులుడు, పేరుకొన వీలుగాని కులమువాడు. భక్తిమార్గంలోని ఒక శాఖను తెలిపేది వైష్ణవుడు. వ్యక్తి నైజాన్ని భిన్న కోణాల్లో తెలిపేవి– భాగవతుడు, భాగవత వతంసము, తపస్వి, వ్రతి, సేవాభావాన్ని తెలిపేవి– విష్ణుదాసుడు, దాసరి.

జన్మరహస్యాన్ని పట్టి ఇచ్చేది చండాలుడు. తినే తిండిని బట్టి వచ్చింది – ప్లవుడు (కుక్కమాంసం తినేవాడు) అధ్యయనానికి సంబంధించింది – అనభ్యస్త శాస్త్రుడు.

వీటన్నింటిని బట్టి తెలిసేదేమిటంటే దాసరి పెద్దగా చదువుకోలేదని, ఏది పడితే అది తింటాడని, ఎదుటివారి సేవలో ఉంటాడని, చెప్పుకోదగని కులంలో పుట్టాడని, వెలివేతకు గురైనవాడని తెలుస్తూ ఉంది. అయితే ఇన్ని అసంబద్ధతల మధ్య అతడు నిష్ఠ గలవాడని, తపస్సంపన్నుడని, విష్ణుపూజా తత్పరుడని, పరమభాగవతుడని, చెప్పినాడు. అందుకే కాబోలు కథా ప్రారంభంలోనే దాసరిని గూర్చి “చండాలేతర శీలుడు” అనే ఒక ప్రశంసా నామాన్ని పేర్కొన్నాడు.

మొత్తంమీద ఇన్ని మిశ్రమగుణాలు గల వ్యక్తి కథకు ఏం పేరు పెట్టితే మాత్రం ఏం లేమ్మని ‘మాలదాసరి కథ’ అని పెట్టారేమో! లేక రాయలు వాడిన పదాలలో మాలవాడని అర్థంవచ్చే పదాలు ఎక్కువగా అతనికి విశేషణాలు కావటంతో ఆ పేరే సబబు అనుకున్నారేమో! లేదా ముద్రాపకులు పాఠకుల్ని ఆకర్షించడం కోసం, ఈ ప్రబంధాన్ని పరిష్కరించిన పండితులు తమ దృక్కోణాల్ని అనుసరించి ఈ పేరుపెట్టి ఉండవచ్చు అనిపిస్తుంది. అలనాటి సమాజం కొందరిని ఎలా చిన్నచూపు చూస్తుందో చెప్పటంతో



పాటు, అట్టిపాత్రలపై సానుభూతిని కూడగట్టటంతో పాటు, ఆ పాత్రల్ని ఆదర్శంగా నిలబెట్టి నట్లవుతుందని ‘మాలదాసరి కథ’ అనే పేరు సాభిప్రాయంగా నిర్ణయించినారు కాబోలు.

## 6. దాసరి ఆధ్యాత్మిక ప్రసంగం

మాలదాసరి బ్రహ్మరాక్షసునితో చేసిన సంభాషణ అంతా, ఆధ్యాత్మిక భావనలతో నిండి ఉంది. అది సాత్త్వికతా ప్రధానమైన ఉపదేశం. ప్రాణులకు మేలు చేసే మాటలకు భగవంతుడు సంతోషిస్తాడని దాసరి అన్నాడు. అట్లైతే భూతహితమైన కార్యాలకు ఇంతకంటె ఎక్కువగా ఈశ్వరుడు హర్షిస్తాడనే కదా భావం. ఇది పరమ సత్యం. ఎందుకంటే పరమాత్మ సర్వభూతాలలోనూ ఉన్నాడు. ఆ యా జీవులకు ఆనందాన్ని కలిగించే ప్రసంగాలేకాక, పనులు కూడ పరమబ్రహ్మ పరమామోదానికి కారణం అవుతాయనటంలో కించిత్తు కూడ సందేహం అక్కర లేదు.

ఈ చర్చవల్ల ప్రాణిహింస పరాత్పరహింస అని గుర్తించవలసి ఉంది. గీతా వాణి ఇలా ఉంటున్నది.

**యుక్తాహార విహారస్య**
**యుక్త చేష్టస్యకర్మణి**
**యుక్త స్వప్నావ బోధస్య**
**యోగో భవతి దుఃఖహా**

**(భగవద్గీత,6/17)**

ఆహార విహారాది సర్వకర్మలు నియమబద్ధంగా సాగించాలి. అప్పుడది దుఃఖ నివారణమైన యోగం అవుతుంది. మానవజీవితం పరిశుద్ధంగా, రోగ రహితంగా, మోక్ష సంధానంగా ఉండాలంటే ప్రతిజీవి ఈ నియమాలను పాటించవలసి ఉంది.

## 6.1. ఆహార శౌచం

ప్రతివ్యక్తి తాను తినే తిండి న్యాయంగా, ధర్మంగా, నీతిగా సంపాదించినదై ఉండాలి. హితం మితం కలది కావాలి. "అహింసా పరమో ధర్మః" అని శ్రుతి ఘోషిస్తూ ఉంది. మాంసాహారం ఎవ్వరికీ కూడదు. స్వాభావికంగా మానవుడు మాంసాహారి కాదు. అతని అవయవాలు అందుకు అనువుగా కూడ లేవు. అయినా అలవాటుపడి జిహ్వాచాపల్యంతో పాపాన్ని మూట కట్టుకొంటున్నాడు. క్షణభంగురమైన శరీరపోషణకై ప్రాణిహింసతో లభించే ఆహారం అవసరమా?

ప్రతి సమాజానికి పారంపర్యంగా వచ్చే సంప్రదాయాలు, ఆచారాలు, ఎన్నో ఉన్నాయి. వానిలో కొన్ని మూఢాచారాలు. అవి పరిహరింప లేని విధంగా వ్యక్తుల్ని కట్టడి చేస్తాయి. ఒక విధంగా ఇది మానవుని బలహీనతే అనాలి. కొందరైతే కట్టుబాట్లు తప్పినట్లు అవుతుందేమో అని, ఇంకా కొందరు తమ దివంగతుల ఆత్మకు అశాంతిని, అసంతృప్తిని కలిగించినవారం అవుతామేమో అని భయపడతారు. చుట్టూ ఉన్న అప్రామాణిక సమాజం చేసే దుర్విమర్శలకు భీతిల్లి నీతిని ప్రక్కకు పెడతారు. అందువల్ల కొన్ని పనులు మంచి చెడ్డల విమర్శకు దూరంగా అట్లే జాడ్యంలా అంటుకొని వస్తుంటాయి. అట్టివానిలో మాంస వినియోగం ఒకటి.

రాక్షసులకు నరమాంస భక్షణం వారసత్వంగా వచ్చిందని, అది పాపం కాదని, తమ సనాతనధర్మం అని బ్రహ్మరాక్షసుడు ప్రకటించుకొన్నాడు. తన వాదాన్ని బలపరచు కొనేందుకు సర్వభక్షకుడైన అగ్నిదేవుణ్ణి సాక్ష్యంగా చూపినాడు. గరుత్మంతుడు లభించిన అమృతాన్ని కాదని, పాముల్ని తన వంశీయులకు ఆహారంగా కోరినాడన్నాడు. ఇదంతా తన పంతం నెగ్గించుకోవడానికి చేసే పిడివాదం తప్ప సహేతుకం కాజాలదు.

నిజానికి రాక్షసులు ప్రత్యేక జాతి కాదు. వారూ మానవులే. వారి వారి ప్రవర్తనను బట్టి రాక్షసులుగా వ్యవహరింప బడుతున్నారు. ఒకే కుటుంబం



వారైనా, వారిలో శ్రీకృష్ణుడు దైవం కాగా కంసుడు రాక్షసుడైనాడు. దేవకి మానవి అయింది. రావణాది రాక్షసులు బ్రహ్మ వంశజులుగా ప్రసిద్ధి చెందిన వారే. కాని వారు లోక కంటకులు కావడంతో రాక్షసులుగా ముద్రపడినారు. దేవత్వానికి రాక్షసత్వానికి కారణం మనస్సే. ఈ సత్యాన్ని అందరూ అంగీకరించవలసి ఉంది.

## 6.2. ప్రతిజ్ఞాపాలన

బ్రహ్మరాక్షసునికి చిక్కిన మాలదాసరి కైశికీసేవ ముగించుకొని వచ్చి ఆహార మౌతానని అతనిని పరిపరివిధాలా బ్రతిమ లాడినాడు. కాని అతడు ఏమాత్రం మెత్తబడ లేదు. చివరకు విష్ణువుపై ఒట్టు పెట్టుకోగా అంగీకరించి వదలి పెట్టినాడు. దీనిని ఏవిధంగా భావించాలి? బ్రహ్మరాక్షసుడు విష్ణువును నమ్మినాడు అనటానికి వీలులేదు. కారణం రాక్షసులు విష్ణువును శత్రువుగా చూస్తారు. పోనీ దాసరినైనా నమ్మినాడా అనటానికీ అవకాశం లేదు. నాటి సహజంలో నిమ్నజాతీయుల్ని నీతిమంతులుగా, సత్యసంధులుగా భావించేవారూ కాదు. పైగా ఆపత్సమయంలో మహామహులే మాట తప్పుతూ ఉంటారు. తమకు ముంచుకొని వచ్చిన ప్రమాదాన్ని దాటటానికి ఏవేవో సాకులు చూపుతారు.

ఇలాంటి సమయాల్లో బాసలు తప్పినా, అబద్ధమాడినా తప్పులేదని కోవిదులే వల్లె వేస్తారు. "వారిజాక్షులందు, వైవాహికములందు, ప్రాణ విత్తమాన భంగమందు, చకిత గోకులాగ్ర జన్మ రక్షణమందు బొంకవచ్చు-నఘము పొంప దధిప!" అంటారు. ఇట్టి శుక్రనీతి తాత్కాలికంగా ఆపదను గట్టెక్కించడానికి మాత్రమే పనికి వస్తుంది. కాని దైవం మెచ్చుకోదగిన శాశ్వత సత్యం కాదన్నది విస్మరిస్తున్నారు.

తన ప్రాణం భయానకంగా హింసమధ్య నలిగిపోతుందని తెలిసికూడ ఆడినమాట తప్పలేదు దాసరి. పశ్చాత్తప్తుడై రాక్షసుడు తినకుండ

వదలిపెడుతానన్నా అంగీకరించలేదు. తనను మంగళకైశికీ వ్రతం పూర్తి చేసికొన వదలినందుకు, తన అనుదిన సేవకు భంగం కలుగకుండ రాక్షసుడు కాపాడినందుకు అతనికి ధన్యవాదాలు తెలిపినాడు. ఇది ఆయన నియమవ్రత పరాయణతకు అద్దం పడుతూ ఉంది. ఇట్టివారే లోకానికి ఆదర్శప్రాయులు. బహుధా ప్రశంసింప దగినవారు.

"ఇప్పటికే బాగా ఆలస్యమైంది. విపరీతమైన ఆకలితో ఉంటావు. నన్ను తృప్తిగా తిని నీ ఆకలిబాధ తీర్చుకో" అని దాసరి రాక్షసుణ్ణి బలవంత పెట్టినాడు. దాసిరి ఒకరి దయాభిక్షవల్ల లభించే జీవితం తనకు అక్కర లేదని భావించినాడు. దైవం తప్ప ఇతరులు చూపే జాలి, కరుణ వంటివి ఆయన ఆశించేవాడు కాదని స్పష్టంగా తెలుస్తూ ఉంది. అజ్ఞానులకు మాత్రమే శరీరంపై ఎనలేని మమకారం. దాసరికి అట్టి బలహీనత ఏ కోశానా లేదు. ఒక ప్రాణి ఆకలి తీర్చి సంతోషపెట్టడం కంటె మించిన జన్మసార్థకత మరొక్కటి లేదని ఆయన బలంగా విశ్వసించినాడు.

తాత్త్వికత పుష్కలంగా పండించుకొన్న మహానుభావుడు దాసరి. ఆయనలో ఏ ప్రాక్తన జన్మపుణ్యమో పురులు విప్పుకొని, ప్రస్తుత జన్మ పవిత్ర కర్మలకు కేంద్రమై, మోక్షానికి పాదులు వేసింది. ఇలా సత్యనిష్ఠ గలవారి మాటలకు అజ్ఞాతబలం ఉంటుంది. అది ఎంతటి కఠినాత్ములనైనా కదలిస్తుంది. చివరకు మార్చేస్తుంది. లేకుంటే బ్రహ్మ రాక్షసుడు ఈ దాసరివల్ల పూర్వరూపాన్ని పొంది భక్తుడుగా మారి ఉండేవాడు కాదు.

దాసరి చేసిన ధార్మిక ప్రవచనాలను గమనిస్తే దాసరి నిర్ద్వంద్వంగా జ్ఞానియే.

**"అక్రోధ వైరాగ్య జితేంద్రియత్వం**
**క్షమా దయా సర్వజనప్రియత్వమ్**
**కామ లోభ భయ శోక వర్జితం**
**జ్ఞానస్య చిహ్నం దశ లక్షణాని – అని ఆర్యోక్తి.**



ఈ పది లక్షణాలు దాసరిలో పుష్కలంగా ఉన్నాయి. అంతేకాక అతడు వాచిక తపస్సు కూడ సాధించినాడా అనిపిస్తుంది. అతని చిత్తశుద్ధి, ఋజుప్రవర్తన, సత్యసంధత అభినందనీయాలు.

**"అనుద్వేగ కరం వాక్యం**
**సత్యం ప్రియం హితం చ యత్**
**స్వాధ్యాయాభ్యసనం చైవ**
**వాఙ్మయం తప ఉచ్యతే**
**(భగవద్గీత 17/15)**

ముందు వెనుకలను అనుసంధానిస్తూ, ఆలోచనీయంగా ఉండేలా, ఆచి తూచి మాట్లాడిన దాసరిని గొప్ప వాఙ్మయ తపస్విగా నిలబెడుతుంది పై సందర్భం.

## 6.3. శిబి ఆదర్శం

పరోపకారార్థం ఇదం శరీరం – అని వేద ప్రవచనం. మానవజన్మ ఇతరులకు సహాయపడుటకే. ఈ సత్యవాక్కును పూర్వులు పెక్కుమంది ఆదరించి ఆ మార్గంలో పయనించినారు. ఈ కశ్మల శరీరం నశ్వరం. దీనిని ఎంత జాగ్రత్తగా పెంచి పోషించినా ఏదో ఒకనాడు కాటికి పోవలసిందే. ఎవని శరీరం మరొక్కరి సహాయానికో సంతోషానికో కారణం అవుతుందో అతని జన్మే ధన్యం, ఉత్కృష్టం. వారే చిరకీర్తులు. అట్టి త్యాగమూర్తులలో శిబిచక్రవర్తి, రంతిదేవుడు, దధీచి, జీమూతవాహనుడు వంటివారు అగ్రగామిగా నిలుస్తారు. ఈ కథానాయకుడు దాసరికి, శిబి ఆదర్శమగుట సహజమే.

శిబి త్యాగనిరతిని విని దేవేంద్రుడు పరీక్షింప దలచినాడు. అగ్ని దేవునితో కలబలుకొన్నాడు. శిబి చక్రవర్తి ఉద్యానవనంలో విహరిస్తూ ఉండగా

అగ్నిదేవుడు పావురమై దాని తినటానికై వెంబడించే డేగగా ఇంద్రుడు మారినారు. పావురం కాపాడుమని శిబిని శరణు వేడింది. శిబి దానికి అభయ మిచ్చినాడు. తనకు ఆహారం కానున్న పావురాన్ని వదలి పెట్టు మంటుంది డేగ. శరణార్థిని గాలికి వదలటం ధర్మం కాదు, కావాలంటే దానికి బదులుగా ఇతర మాంసం ఇస్తానన్నాడు శిబి. డేగ అంగీకరించ లేదు. నీ శరీరమాంసాన్ని ఇస్తే పావురాన్ని విడిచిపెడతాను అని శిబితో అనింది డేగ.

ఆ మేరకే పావురాన్ని ఒకవైపు తక్కెడలో ఉంచి, దానితో సరిపడే మాంసాన్ని తన శరీరం నుండి కోసి ఇవతలి తక్కెడలో ఉంచాడు. కాని త్రాసు సరితూగలేదు. చివరకు శిబి తానే త్రాసులో కూర్చున్నాడు. అప్పటికి పావురంతో సమానంగా తూగినాడు. అనగా సశరీరంగా తనను తాను డేగకు ఆహారంగా సమర్పించు కోవడానికి సిద్ధమైనట్లే. ఈ త్యాగనిరతికి, శరణాగత వాత్సల్యానికి ఇంద్రాగ్నులు సంతోషించారు. నిజరూపాలతో ప్రత్యక్షమై శిబిని ఆశీర్వదించినారు.

దాసరి బ్రహ్మరాక్షసునకు ఆహారంగా తన శరీరాన్ని నిశ్శంకగా ఇవ్వటానికి సిద్ధమైనాడు. తన సత్యనిష్ఠను కాపాడుమన్నాడు. యుగాంతర వాసియైన శిబి నేటి దాసరికి ఆదర్శమైనాడు. సుదీర్ఘమైన కాలానికి, సువిశాలమైన ప్రపంచానికి అతీతంగా ఉన్నతమైన విలువలు ఎవరైనా ఆచరింపదగినవే.

## 6.4. ఆత్మ నివేదన

బ్రహ్మరాక్షసుని నుండి అనుమతి పొంది దాసరి తన ఇష్టదైవాన్ని సేవించడానికి మన్నారు గుడికి వెళ్లినాడు. అక్కడ సంతోషంగా సంగీత సేవలో పాల్గొన్నాడు. అతని ముఖంలో ఏ కోశాన మరణభయం లేదు. నృత్యంలో పాదాలు తొట్రుపాటు చెందలేదు. గీతాలాపనలో పదాలు లయ



తప్పలేదు. సేవలో పరాఙ్ముఖత కనపడలేదు. ఇట్టితీరు బొత్తిగా దేహభావన లేని తాత్త్వికులకు తప్ప ఇతరులకు సాధ్యం కాదు.

దేహభ్రాంతి పూర్తిగా తొలగిపోవాలంటే బ్రహ్మజ్ఞానం ఉదయించాలి. అట్టి వివేకోదయం కలిగిననాడు శరీరం ఒకమాంసం ముద్ద. దానిని కేవలం ఆధ్యాత్మిక సాధనకు ఉపయోగపడే యంత్రంగా తాత్త్వికులు భావిస్తారు. దేహత్యాగాన్ని లౌకిక బంధవిముక్తైన గొప్పవరంగా స్వీకరిస్తారు. వారు సర్వత్ర నిర్వికారులై దేనికీ వికృతి చెందరు. ఎంత అందమైన ఆరోగ్యకరమైన శరీరమైనా దానికి నిత్యత్వం లేదని కొంచెం ముందు వెనుకలుగా అది రాలిపోతుందని వారికి తెలుసు. కాబట్టి గాలిబుడగ వంటి శరీరం కోసం వారు తాపత్రయపడరు. అట్టివారు మనస్సు గాలి సోకని ప్రమిదవలె నిశ్చలంగా ఉంటుంది. భగవద్భక్తిలోని వెలుగును వారు సులువుగా దర్శింపగలరు. ఆదే వారి సర్వస్వం.

బాహిరమైన పూజతో ఆత్మ నివేదనను శ్రుతిగలిపి తమ హృదయం నిండా భగవంతుని నింపుకొంటారు. పారవశ్యానికి లోనై ఆడగలరు, పాడగలరు. ఇలా దేహం మనస్సు రెండూ ఒకబాటలో నడువ గలిగిందే స్వచ్ఛమైన పూజ. అదే పరిశుద్ధమైన ఆత్మనివేదన. దాసరిలో దీన్నె దర్శించ గలుగుతాము.

## 6.5. మంత్ర మహిమ

దైవాన్ని ఉద్దేశించి శిష్యులకు గురువులు ఒక ప్రత్యేక మంత్రాన్ని ఉపదేశిస్తారు. దానిలోని బీజాక్షరాలు, మంత్రాన్ని స్వీకరించిన శిష్యుని చిత్త ప్రవృత్తిని బట్టి, దైహిక సామర్థ్యాన్ని బట్టి, పూర్వజన్మ విశేషాన్ని బట్టి ఉంటాయని అంటారు. కాబట్టి అట్టి మంత్రాన్ని శిష్యులు బహిర్గతం చేయరాదని గురువులు నియమాలు విధిస్తారు. దీనికి భిన్నంగా ప్రవర్తిస్తే పాపం వస్తుందని, నరకం అనుభవిస్తారని భయపెడుతూ ఉంటారు. శిష్యుల్ని

తమ అధీనంలో ఉంచుకోవడానికి స్వార్థపరులైన గురువులు చేసే ఎత్తుగడ తప్ప వేరు కాదు.

“మననా త్రాయతే మంత్రః” అని మంత్ర నిర్వచనం. అనగా ఆ మంత్రాన్ని ఎవరైతే నిత్యం మననం చేస్తూ ఉంటారో వారిని అది రక్షిస్తుందని అర్థం. ఇలా ఎంతో విలువైంది, పవిత్రమైంది, పారలౌకిక దృష్టిని పెంచే మంత్రాన్ని బాహాటంగా ఉంచితే మాత్రం తప్పేమిటి? దానివల్ల ఏదో నష్టం కలుగుతుందని అనుకోవడం అవివేకం. వ్యక్తి నిష్ఠపై, తాత్కాలిక లాభాన్ని కూర్చి లోకానికి అపకారం చేసే అభిచార హోమాల్లోని మంత్రాలైతే బహిరంగంగా వెల్లడి చేయడంవల్ల హాని కలుగుతుందేమో కాని, భగవదనుగ్రహం కోసం నిర్దేశించిన మంత్రం అందరికీ తెలిసినా ఎవ్వరికీ ఏ హానీ జరుగదు.

ఋగ్వేదంలోని శ్లోకాలన్నీ మంత్రాలుగానే పరిగణింపబడుతూ ఉన్నాయి. వాటిని యజ్ఞ యాగాదుల్లో బిగ్గరగా ఉచరిస్తున్నారు. రవ్వంత రహస్యాన్ని కూడ పాటించడం లేదు. ప్రకృతిలో తొలి పలుకులుగా, భగవన్ముఖ నిస్రుతాలుగా భావింపబడే ఈ మంత్రాలకు లేని నిషేధం, గురువులు శిష్యులకు మాత్రమే చెవుల్లో ఊదే మంత్రాలకు ఎందుకు నిషేధం? అందుకే భగవద్రామానుజాచార్యులవారు తమ గురువైన పూర్ణాచార్యుల నుండి విధిహితంగా స్వీకరించిన మంత్రాన్ని శ్రీరంగనాథ దేవాలయ గోపురం ఎక్కి భాగవతులందరికి బిగ్గరగా వినిపించినాడు. గురువును క్షమాభిక్ష వేడుతూ ‘ఈ కారణంగా నేనొక్కడినే నరకానికి పోయినా, ఎందరో స్వర్గానికి పోతారు కదా’ అన్నాడు. చివరకు గురు దేవులుకూడ సంతోషించినారు.

**తృజే దేకం కులస్యార్థమ్**
**గ్రామ స్యార్థం కులం తృజేత్**
**గ్రామం జనపద స్యార్థే**
**ఆత్మార్థం పృథివీ తృజేత్**



అన్నారు ఆర్యులు. కుటుంబం కొఱకు వ్యక్తిని, గ్రామం కొఱకు కుటుంబాన్ని, దేశం కొఱకు గ్రామాన్ని, స్వీయప్రగతికై దేశాన్ని త్యాగం చేయవచ్చు- అని నీతి.

తన పాలిట గురువు ఉపదేశించిన మంత్రమే రామానుజులవారికి సర్వశరణ్యం. అయినా విశ్వహితాన్ని ఆకాంక్షించి అందరికీ మంత్రాన్ని గురువుపేరు మీదుగానే చెప్పి స్వార్థత్యాగాన్ని చేసిన రామానుజులవారి ఔన్నత్యం ఎంతైనా కొండాడ దగింది. ఈయనది మంత్రమహిమ. ఆయనవలెనే మాలదాసరి కూడ బ్రహ్మరాక్షసుని దైహిక దాహాన్ని అర్థం చేసికొని తన తనువునే సమర్పించటానికి సిద్ధమైనాడు. ఆ రాక్షసుని మానసిక ఆకాంక్షను సైతం గమనించి హరికీర్తనా గానఫలాన్ని దైవం పేరు మీదుగా దాసరి అందజేసి ఆదర్శనీయుడైనాడు. అయితే ఇతనిది గాన మహిమ.

### 6.6. మంగళకైశికి ప్రాధాన్యత

పూజ ముగించుకొని తిరిగివచ్చిన మాలదాసరిని బ్రహ్మరాక్షసుడు తినలేదు. ఆ పూట పాడగా లభించిన మంగళకైశికీగాన ఫలాన్నైనా ఇచ్చి తనకు విముక్తి కలిగించుమని ప్రాధేయపడినాడు. దాసరి పాటకు అంతశక్తి ఉన్నదా? అదే నిజమైతే ఎన్నోనాళ్లు దీక్షగా అతడు సాగించిన గానానికి ఇంకెంతటి శక్తి ఉండాలి? అందుకే కాబోలు ‘భగవత్సేవకు వెళ్లేముందు శరీరాన్ని ఇస్తానన్నానే గాని, పాట ఫలం ఇస్తానన లేదని దాసరి తిరస్కరించాడు.

దాసరి దృష్టిలో శరీరంకంటె పాటగొప్పదనే భావం ఉండవచ్చు. అంతేగాదు. దానిని పాడిన వ్యక్తిలోని సమాహిత చిత్తశుద్ధిలోని ఔన్నత్యాన్ని పై భావన చాటుతుంది. వైదిక కాలమంతా భగవంతుని పాటల రూపంగానే గానం చేసేవారు. సామవేదమంతా గానానికి అనువుగా ఉంది. భగవంతుడు

సామగాన లోలుడుగా పేర్కొనబడినాడు. అట్టి భగవంతుడిని, ఆలాపనా భక్తి విధానంతో తన అంతికానికి తెచ్చుకొన్న మాలదాసరి సాక్షాత్తు నారదుడే అనిపిస్తుంది.

మాలదాసరి తనను ప్రతిదినం మంగళకైశికీ రాగంలో ప్రస్తుతించే వాడని, ఆ పాట తనకు ప్రీతిప్రదమైందని "పాడు, మము, లాలస మంగళనామకైశికిన్" అని శ్రీరంగేశ్వరుడు తృప్తిగా విష్ణుచిత్తునితో చెప్పినాడు. బ్రహ్మరాక్షసుడు సైతం, ఈ రాగాలాపన వల్ల వచ్చే ఏ కించిత్తు ఫలమైన తనను ఉద్ధరించగలదని విశ్వసించినాడు. కావున మహిమోపేతమైనదిగా ఈ రాగం కావ్యప్రశస్తి చెందింది. శక్తిమయ రాగంగా సంగీత శాస్త్రంలో ప్రసిద్ధికెక్కింది.

భగవంతుడు నాదప్రియుడు. సంగీతం నాదప్రధానం. ఆపాత మధురమైన సంప్రదాయ సంగీతం సద్యఃపర నిర్వృత్తి కలిగిస్తుందని పదకర్తల అభిభాషణం. వీరు రచించిన కీర్తనలు అనేక రాగాలలో ఆలపింపబడుతూ ఉన్నాయి. వీటిలో మంగళకైశికీ రాగం విశిష్టమైన విలువలు కలది. ఈ రాగాలాపన అనంత పుణ్యఫలప్రదం అని క్రింది శ్లోకాలు ధృవీకరిస్తున్నాయి.

**యన్మయా పశ్చిమం గీతం స్వరం కైశిక సంజ్ఞకం**
**ఫలేన యస్య భద్రంతే మోక్షయిష్యామి కిల్బిషాత్**
**యస్తు గాయతి సంయుక్తం కైశికం విష్ణు సంసది**
**సతారయతి దుర్గాణ శ్వపాకో రాక్షసం యదా.**

కైశికి అనే సంజ్ఞగల గీతయొక్క ఉత్తరార్ధంవల్ల శుభాలు కలుగుతాయని, పాపాలనుండి విముక్తి నొంది మోక్షం సిద్ధించుకోగలరని, విష్ణుసన్నిధిలో దీనిని ఆలపిస్తే శ్వపాకులైనా రాక్షసులైనా దుర్గమస్థితుల్ని అధిగమిస్తారని అప్పటి వారి విశ్వాసం. దీనిని బ్రాహ్మముహూర్తాన, సాయం సమయాలలో దైవసన్నిధానంలో ఆలపిస్తారు. ఇది భగవంతుణ్ణి ప్రేమిస్తూ, భగవంతునికి



హృదయరంజకంగా ఉండేటట్లు, ఆర్తితో తాదాత్మ్యంతో, సమాధి స్థితిలోనికి వెళ్లి ఆలపింప బడుతుంది.

ఈ రాగాన్ని మంగళకైశిక అని కూడ వ్యవహరిస్తారు. ప్రస్తుతం ఇది తెలుగునాట ప్రచారంలో లేదు. పదునైదవ మేళకర్త రాగమైన మాయా మాళవగౌళ జన్యం ధీరశంకరాభరణమైతే, ఈ శంకరాభరణస్వరాల అనుసంధానమే పూర్ణ చంద్రిక. ఈ రాగమే నేటికీ తమిళనాట మంగళ కైశికిగా పిలువబడుతూ ఉంది. ఇందులో ఏడు స్వరాలు ఉండవు. కారణం ఇది మేళకర్తల రాగం కాదు. షాడవాష్టమరాగం. దీని ఆరోహణం 'సరిమగదప'. అవరోహణం 'సనిదపమగరి' అని సంగీతజ్ఞులు చెప్తూతారు.

మాలదాసరి కాలం నాడే కాక, జయదేవుడు, అన్నమయ్య కాలాల్లో కూడ ఈ రాగం ఉన్నట్లు తెలుస్తూ ఉంది. ప్రాచీన గ్రంథాలైన 1. సుబ్బరాయ దీక్షిత విరచిత 'సంప్రదాయ సంగీతదర్శిని' 2. సోమనాథ ప్రణీత 'రాగవిబోధ' 3. రామార్యకృత 'స్వరమేళకళానిధి' మున్నగు గ్రంథాలలోనూ ఈ రాగప్రస్తావన ఉంది. సంగీత త్రయంలో ఒక్కరైన ముత్తుస్వామి దీక్షితులు శ్రీరంగనాథుని దేవేరి రంగనాయకి స్తుతిపరంగా ఒక కృతిరచించి, దాని రాగముద్ర 'మంగళకైశికి' అన్నాడు. శ్రీ వేంకటేశ్వర సుప్రభాత గద్యలో ప్రవచింపబడే 72 మేళకర్తల రాగాలలో కైశికీ రాగానికి పుష్టిని సమగ్రతను గూర్చిన పూర్ణచంద్రిక కూడ కలదు.

## 6.7. దాసరి కులం

'దైవార్చన ముగించుకొని వస్తాను. నన్ను వదలిపెట్టుము' – అని దాసరి కోరగా బ్రహ్మరాక్షసుడు పరిహాసపూర్వకంగా నవ్వుతూ అతని చెక్కిలిని తన చేతివ్రేళ్లతో మీటుతూ

**-----------------లెస్స పం**
**దించితివోయి దాసరి వనిం దెఱవాటులు కొట్టి కొట్టి మే**

**న్వెంచి విరక్తి దాసరివి నిన్నగదా అయినాడ వీ మమున్**
**కొంచెము జేసి తాడ్గొరికికో తలపోసెదు మెచ్చితి న్నినున్**
**(ఆముక్త మాల్యద, 6/40)**

అయ్యా! దాసరీ నీవు నానుండి తప్పించుకోవడానికి మంచి ఎత్తు ఎత్తావు. నీ గూర్చి నాకు తెలీదు అనుకున్నావా? ఒళ్లు బలిసి ఇన్నాళ్లు దారి దోపిడీలు చేశావు. వయస్సు మళ్లటంతో ఆ వృత్తి వీలుకాక, మానుకొని, విరక్తి భావంతో సులువుగా బ్రతుకు సాగించడానికై నిన్ననే గదా దాసరి అవతారం ఎత్తావు – అన్నాడు.

ఈ మాటల్లోని సత్యమెంత? దాసరి కథలో ఎక్కడా ఆయన దొంగతనాలు చేసినట్లు రాయలు చెప్పలేదు. అయితే ఇక్కడ బ్రహ్మరాక్షసునితో పై విధంగా పలికించినాడు. దుర్గమాటవిలో మఱ్ఱిచెట్టు నివాసంగా ఉన్న రాక్షసునికి ఆ సమీపప్రాంతంలో జరిగే సంఘటనలు అతని కంటపడి ఉండవచ్చు. తన ఎరుకలో దాసరి కొన్నాళ్లపాటు దారి దోపిడీలో బ్రతుకు సాగించి ఉండవచ్చు. అలా కాకపోతే రాక్షసుడు ఈ మాట అనటానికి వీలు లేదు. దాసరి కూడ దీనిని ఖండించిన దాఖలాలు లేవు.

సమాజం ఇతనిని పంచముడని, చండాలుడని ముద్రవేసి వెలివేతకు గురిచేసింది. ఎవరిపుట్టుకా వారి చేతుల్లో లేదు. అలాంటప్పుడు జన్మ ఆధారంగా తనది గాని తప్పునకు తనను సమాజం తక్కువగా చూచింది. తనపై నిందారోపణలు చేస్తూ ఆనందించింది. మీద మీద తాను చవిచూస్తున్న అవమానాలపై కొంత తిరుగుబాటు అవసరమై ఉంటుంది. దీనివల్ల సహజంగానే సమాజంపై పగ, కోపం కసి పెంచుకొని ఉంటాడు. దాని దుష్ఫలితమే దారిదోపిడీ కావచ్చు. అయితే ఇది ఎల్లకాలం సాగిన వృత్తి కాదు.



అచిరకాలంలోనే అతడు. వైష్ణవ దాసరి అయినాడు. సాధుమార్గం పట్టి విష్ణుభక్తు డైనాడు. ఇదెట్లా సాధ్యం. అంటే అంగుళీమాలునకు బుద్ధునివలె, ఏ మహానుభావునివల్లనో వైష్ణవబోధ జరిగి ఉంటుంది. అది మార్పునకు కారణం కావచ్చు. ఈ దశలో సాత్త్వికత ముదిరి తనకు ఎదురైన చేదు అనుభవాలను అన్నింటిని సహించే స్థితికి వచ్చినాడు. తన పట్ల ఏహ్యాభావంతో ఉన్నవారిలో రావలసిన సంస్కారాన్ని కాలానికో దైవానికో వదలి ఓర్చుకుంటున్నాడు.

దేవాలయప్రవేశం నిరాకరించినా, స్వయంగా మంచినీళ్లు త్రాగటానికి వీలులేని పరిస్థితి తలెత్తినా, దేనినీ ప్రతిఘటించకుండ, తన భక్తిని, అంతరంగ శుద్ధిని దేవునికి కాన్క చేసికుంటూ మౌనంగా ఉండటానికి మాత్రమే అలవాటు పడ్డాడు. అందుకే రాయలు ఇతనిని కథారంభంలోనే 'చండాలేతర శీలుడు' అన్నాడు. అంటే సహజంగా చండాలు రైనవారిలో ఉండే గుణాలు ఇతనిలో లేవనే అర్థం. అంతేగాదు దాసరిని ఉద్దేశించి వ్రతి, తపస్వి, విష్ణుదాసుడు – అంటూ కీర్తించినాడు. కలిసివచ్చిన మంచి అవకాశాలను కాలదన్నకుండ తనను తాను ఉన్నతుణ్ణి చేసికొన్నవాడు మాలదాసరి. మన సహన సౌశీల్యాలు ఎదుటి వ్యక్తుల్లో ఉండే కర్కశత్వాన్ని తుడిచిపెట్టగలవని విశ్వసించినవాడు.

## 7. దేవాలయప్రవేశం

విదేశీయుల మతప్రభావాలు సోకని ప్రాచీన కాలంలో అన్ని వర్గాల వాళ్లు భగవంతుణ్ణి సేవించడానికి వీలుగా మనదేశంలో దేవాలయాలు ఉండేవి. ఆభిజాత్య గర్వంచే హృదయనేత్రాలే రాక బాహిర చక్షువుల్ని సైతం తెరువలేని వాళ్లు, దేవుడు బాహ్యశుద్ధికంటె అంకితభావంతోడి ఆత్మశుద్ధికే విలువనిస్తాడనే విషయాన్ని విస్మరించారు. ఆ కారణంగా గుడిలోని లోలోపలి ప్రాకారాల లోనికి కొందరిని అనుమతించేవారు కాదు.

తక్కువ కులాలుగా ముద్రవేయబడినవాళ్లు కూడ సవర్ణుల్ని కాదని సాహసం చేసి కొన్ని నియమాలను ఉల్లంఘించేవారు కాదు. ఆముక్తమాల్యద కథలో మాలదాసరి విషయంలో ఇదే జరిగింది. "జాత్యుచిత చరిత్రుడై" మెలగినట్లు రాయలు చెప్పినాడు. అంతరావరణ ప్రవేశానికి మాలదాసరి నోచుకోలేదు.

భక్తి పారవశ్యంతో, సంతోషాశ్రువులు స్రవిస్తూ ఉండగా, మధ్యాహ్నం దాకా నాట్యం చేసి అలసిపోయిన మాలదాసరికి గ్రుక్కెడు మంచినీళ్లు కూడా లభించలేదు. గర్భగుడి కడుగగా రాతితొట్టిలోనికి వచ్చిపడిన మలినజలమే అతనికి గతి అయ్యింది. అదైనా తానుగా తీసికొనే వీలులేదు. తనకంటె కించిత్తు ఉన్నత సామాజిక స్థాయిగల శూద్రుడు దయదలచి దోసిట్లో పోస్తే త్రాగవలసిన దుస్థితి. ఇక భగవత్ప్రసాదానికైతే ఇతడు చేయి చాచడానికి వీలులేదు. వీణ దండెను చాస్తే, దయదలచి శూద్రుడు దానిపై ఉంచితే అది తీసికోవాలి. ఎవరో ఇచ్చేదాక వేచి ఉండాలి. అతని ఆకలిని గూర్చి పట్టించుకొనే నాథుడే లేడు. భక్తుల విషయంలో సమన్యాయం ఉండాలి. దైవ సాన్నిధ్యంలో ఒకరికి వరంగా నిలిచిన సమాజం మరొక్కరి పాలిట శాపంగా పరిణమించటం మిగుల చింత్యం.

మాలదాసరి సాత్త్విక భావసంపన్నుడు. భగవంతుడు అణువునుండి బ్రహ్మాండందాకా వ్యాపించి ఉన్నాడనే సత్యాన్ని అంతరాంతరాల్లో నిలుపుకొన్నవాడు. ఈ విషయం కథాంతంలో స్పష్టమవుతుంది. అయితే ఎదుటివారిలోను భక్తి పాదుకొల్పాలంటే కొన్ని ప్రత్యక్షక్రియలు అవసరం అని నమ్మినవాడు. కాబట్టి తనవంతుపాత్ర నిర్వహించదానికై గానాలాపన, తాండవాది ప్రదర్శనలకు విలువ నిచ్చినాడు. నిద్రను లక్షించకుండ ప్రతిదినం మూడు యోజనాలు ప్రయాణించేవాడు. ఇది అతనిలోగల తిరుగులేని భక్తికి నిలువెత్తు సాక్ష్యం.



## 8. ఆళ్వారుల ఆదర్శం

ఆళ్వారులలో ఎక్కువమంది శూద్రులు. దళితులే. వీరంతా భగవానుని అనుభవం అనే ప్రవాహంలో సంపూర్ణంగా మునిగి తేలినవారు. భగవంతుని సాన్నిహిత్యాన్ని పరమ తీవ్రంగా కాంక్షించినవారు. అందరివలె కర్మబద్ధులైనా పరమాత్మని నిర్హేతుకజాయమానకృపచేత దివ్యమైన అనుగ్రహాన్ని పొందినవారు. ప్రేమకు నెలవైన హృదయంతో ధ్యాన సిద్ధిని అందినవారు. శ్రియఃపతియే పరదైవం అనే ప్రగాఢ విశ్వాసంతో జీవించినవారు. తమవాక్కుల ద్వారా భగవద్వాణిని లోకులకు వినిపించిన ఉపకారులు. ఆ పరాత్పరుని గుణగానంతో తన్మయులై సామాన్యుల్ని కూడ తమ పరిధిలోనికి చేర్చుకొన్న విశాలహృదయులు. ఆముక్తమాల్యదలోని మాలదాసరి వీరి పరిధిలో చేరిన సామాన్యులలోని అసామాన్యుడు.

రాయలు ఈ ఆళ్వారులను క్రింది విధంగా కీర్తించినాడు.

**అల పన్నిద్దరు సూరులందును సముద్యల్లీల కాపున్నవె**
**గ్గలపుందాపము బాపనా నిజమనః కంజాత సంజాత పు**
**ష్కల మాధ్వీక ఝరిన్ మురారి నొగియంగా చొక్కిధన్యాత్ములౌ**
**నిల పన్నిద్దరు సూరులం దలతు మోక్షేచ్ఛామతిన్ దివ్యులన్**

**(ఆముక్త మాల్యద 1/10)**

ఈ ఆళ్వారుల భక్తవిజయాలకు ప్రచురప్రచారం కలిగించవలసి ఉంది. మాలదాసరి భక్తివిజయం వీరివంటిదే.

నయన గోచరమైన ప్రకృతిలో వివిధ వర్ణాలు (రంగులు) ఆనందాన్ని ఇస్తాయేమో గాని, సమాజంలోని వర్ణాలు (చాతుర్వర్ణాలు) కొందరి కుమతుల కారణంగా ఖేదాన్నే కలిగిస్తూ ఉన్నాయి. అందుకే మహాత్ములు వసుధైక

కుటుంబ స్థాపనలో భాగస్వాములై మానవుని లోని మాధవదర్శనం చేస్తారు. ఈ పృథుమార్గాన్ని మాలదాసరి పాత్రలో బ్రహ్మరాక్షసుని గట్టెక్కించుటలో చూడండని సున్నితంగా హెచ్చరించాడు రాయలు.

**సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః**

**శ్రీమద్ భగవద్గీత 6/29.**

ఈ సమదర్శనాన్ని ఆళ్వారులు ఆచరణలో చూపినారు. దీనిని ఆదర్శంగా తన పరిమిత పరిధిలో వికసింప చేసినవాడు మాలదాసరి.

మాలదాసరిని మనమార్గ నిర్దేశకుడుగా స్వీకరిద్దాం. మన మనో ముకురాలను పరిశుభ్రంగా ఉంచుకొందాం. హృదయం వాకిళ్లు తెరచి ఉంచుదాం. మంచి ఎక్కడున్నా స్వాగతిద్దాం. 'సర్వేజనా స్సుఖినో భవంతు' అన్న వాక్యాన్ని నినాద ప్రాయంగా కాక ఆచరణలో నిల్పుదాం.